

సూపర్ సైకతం

సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్ గురించి వివరిస్తూ బుధవారం కొత్తపట్నం తీరంలో ఏర్పాటు చేసిన సైకత శిల్పం ఆకట్టుకుంది. సాగర మిత్రలు, కొత్తపట్నం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో 'తక్కువ పన్ను.. ఎక్కువ ఆనందం' అన్న నినాదంతో దీన్ని రూపొందించారు. ఏపి వస్తువుల ధరలు అందుబాటులోకి వచ్చాయన్న దాన్ని కూడా పొందుపర్చారు. జీఎస్టీ రాష్ట్ర డిప్యూటీ కమిషనర్ సత్యప్రకాష్, పంచాయతీరాజ్ అధికారులు, పర్యాటకులు ఆసక్తిగా తిలకించారు.

- ఆంధ్రజ్యోతి. కొత్తపట్నం

ఉపాధి కల్పనే లక్ష్యంగా పనిచేయాలి

- శిక్షణకే పరిమితం కావొద్దు
- డీపీఆర్, బ్యాంకు రుణం మంజూరు వరకు తోడుగా నిలవాలి
- పరిశ్రమల శాఖ అధికారులకు కలెక్టర్ రాజాబాబు ఆదేశం

9లో

చలో కర్నూలు

ప్రధాని మోదీ సభకు తరలిన కీలక నేతలు

- కొందరు అక్కడ ముందస్తు ఏర్పాట్లలో బిజీ
- జిల్లా నుంచి వెళ్లిన 600 మంది ప్రతినిధులు
- 160 ఆర్టీసీ బస్సులు కేటాయింపు
- నేటి ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు దోర్నాల వద్ద ట్రాఫిక్ నిలిపివేత
- గిద్దలూరు ఘాట్‌రోడ్డుపై మరిన్ని జాగ్రత్తలు
- ఎగువ ప్రాంతం నుంచి వచ్చే వారికి ఆరు విశ్రాంతి కేంద్రాలు ఏర్పాటు
- ఒంగోలులోని కలెక్టరేట్‌లో కంట్రోలు రూం



ప్రధాని సభకు జనసమీకరణపై కర్నూలులో నిర్వహించిన టీడీపీ కోడుమూరు నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రి రవికుమార్, ఎమ్మెల్యేలు ఉగ్ర, కందుల, దామచర్ల, ముత్తుముల తదితరులు

జిల్లాకు చెందిన ముఖ్య ప్రజాప్రతినిధులంతా కర్నూలుకు తరలారు. జీఎస్టీ సంస్కరణల ఫలితాలను ప్రజలకు వివరించేందుకు గురువారం కర్నూలు నగర శివారులో రాష్ట్ర ప్రభుత్వం భారీ బహిరంగ సభ నిర్వహిస్తోంది. ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొంటుండగా అందుకు సంబంధించి భారీ ఏర్పాట్లు చేశారు. ఆ సభను సీఎం చంద్రబాబు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. కర్నూలు జిల్లాకు చెందిన వారికి సహాయంగా సభ ఏర్పాట్లు, జన సమీకరణ కోసం సమీప ప్రాంతాల వారికి సమన్వయ బాధ్యతలు ఇచ్చారు. అందులో మన జిల్లాకు చెందిన కీలక నేతలు కూడా ఉన్నారు. వారు అంతాతామై ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ప్రధాని సభకు వెళ్లే వారి అవసరాల కోసం జిల్లాలోనూ శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు. పోలీసులు అప్రమత్తమై భద్రతా ఏర్పాట్లతోపాటు ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

ఒంగోలు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో టీడీపీకి చెందిన కీలక ప్రజాప్రతినిధులు, నేతలు కర్నూలు చేరారు. ప్రధాని మోదీ సభ ఏర్పాట్లు, జనసమీకరణలో తలమునకలై ఉన్నారు. బుధవారం కూడా పలు సమావేశాలతో బిజీబిజీ అయ్యారు. జిల్లా నేతలను అక్కడి నియోజకవర్గ సమన్వయకర్తలుగా నియమించడంతో స్థానిక నాయకులను కలుపుకొని ముందుకు సాగుతున్నారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, అశోక్‌రెడ్డి, మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య తదితరులు మూడు రోజులుగా అక్కడే మకాం వేసి ముందస్తు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. మరోవైపు సమీప జిల్లాల నుంచి కూటమి నాయకులు, వివిధస్థాయి ప్రజాప్రతినిధులతోపాటు పలు వర్గాలకు చెందిన ప్రతినిధులను కూడా హాజరుకావాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈనేపథ్యంలో జిల్లాకు చెందిన మంత్రి డాక్టర్ స్వామి, ఎమ్మెల్యేలు నారాయణ రెడ్డి, బీఎన్ విజయకుమార్ తోపాటు వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు, ఇతర ముఖ్యనేతలు బుధవారం సాయంత్రానికి కర్నూలు చేరుకున్నారు.

అన్ని వాహనాలు గిద్దలూరు నుంచే..

దోర్నాల నుంచి శ్రీశైలం వైపు వెళ్లే అన్ని రకాల వాహనాల రాకపోకలను గురువారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు నిషేధించారు. పల్నాడు వైపు నుంచి కర్నూలు వైపు వెళ్లే అన్ని వాహనాలను ఆ సమయంలో పెద్దారవీడు మండలం కుంట నుంచి గిద్దలూరు వైపునకు మళ్లించి నంద్యాల మీదుగా కర్నూలు వెళ్లే విధంగా ఏర్పాటు చేశారు. అటు నుంచి వచ్చే వాటిని కూడా అలాగే నడపనున్నారు. దీని వల్ల గిద్దలూరు ఘాట్‌రోడ్డులో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా మరిన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. కర్నూలు సభకు జిల్లా నుంచి 160 బస్సులను కేటాయించారు. ప్రధాని సభకు సంబంధించి జిల్లాలో మొత్తం ఏర్పాట్లను సమన్వయం చేసేందుకు కలెక్టరేట్‌లో కంట్రోలు రూంను కూడా ఏర్పాటు చేశారు.

జిల్లాలోనే విశ్రాంతి ఏర్పాట్లు

పొదుపు గ్రూపులు, శ్రమశక్తి సంఘాల సభ్యులు, వివిధ వ్యాపార, వాణిజ్య రంగాలకు చెందిన 600 మంది ప్రతినిధులను కర్నూలు సభకు పంపించాలన్న ఉన్నతాధికారుల ఆదేశాలతో పశ్చిమప్రాంతం నుంచి పంపుతున్నారు. కర్నూలు వెళ్లే వారికి మార్గమధ్యలో విశ్రాంతి, భోజనాలు, వసతి సదుపాయాల కోసం ఆరు విశ్రాంతి శిబిరాలను ఏర్పాటు చేశారు. ఇందులో జిల్లాకు చెందిన వారికి గిద్దలూరులో మూడుచోట్ల, కృష్ణా జిల్లా వారికి కంభంలో, ఎన్‌టీఆర్ జిల్లా వారికి మార్కాపురం, బేస్తవారపేటలో శిబిరాలను ఏర్పాటు చేశారు. బుధవారం రాత్రికి అక్కడ భోజనం, వసతి సౌకర్యాలు కల్పించి గురువారం ఉదయం కర్నూలు వెళ్లేలా చర్యలు తీసుకున్నారు. వాటికి జిల్లా అధికారులను పర్యవేక్షకులుగా నియమించారు. ఇక పల్నాడు జిల్లా నుంచి శ్రీకాకుళం వరకు 16 జిల్లాల వారు కర్నూలు ప్రధాని సభకు మన జిల్లా నుంచే ప్రయాణించాల్సి ఉంది. దీనికి తోడు ప్రధానమంత్రి కర్నూలు సభకు ముందు శ్రీశైలం దేవస్థానాన్ని సందర్శించనున్నారు. దీంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ఎక్కడికక్కడ పోలీసులు అప్రమత్తమయ్యారు.

నల్లమలలో భద్రత పెంపు

- పీఎం పర్యటనకు భారీ బందోబస్తు
- దోర్నాలలో 250 మందికి పైగా సిబ్బందితో పహారా
- కర్నూలు-దోర్నాల, శ్రీశైలం-దోర్నాల ఘాట్ రోడ్లలో జల్లెడ
- ప్రత్యేక నిఘాపై డీఎస్పీ నాగరాజు దిశానిర్దేశం

పెద్దదోర్నాల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : శ్రీశైలంలోని మల్లన్నను గురువారం ప్రధాని మోదీ దర్శించుకోనున్న నేపథ్యంలో పోలీసు అధికారులు ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. ఇప్పటికే కేంద్ర బలగాలు నల్లమలలో కీలకమైన ప్రాంతాలను పరిశీలించి ఆధీనంలోకి తీసుకున్నాయి. ఈ క్రమంలో పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మార్కాపురం డీఎస్పీ యు.నాగరాజు డివిజన్‌లోని ముగ్గురు సీఐలు, 12మంది ఎస్సైలు, 245 మంది పోలీసు సిబ్బందిని అప్రమత్తం చేశారు. దోర్నాల స్టేషన్‌లో బుధవారం సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. దోర్నాల కేంద్రంగా కర్నూలు-దోర్నాల, శ్రీశైలం-దోర్నాల ఘాట్ రోడ్లలో పర్యవేక్షణ, ఎక్కడ ఎంతమంది సిబ్బంది ఉండాలన్న దానిపై దిశానిర్దేశం చేశారు. పీఎం శ్రీశైలం వచ్చి తిరిగి కర్నూలు వెళ్లే వరకు విధుల్లో నిర్లక్ష్యం చూపకుండా ఉండాలన్నారు. నల్లమలలో ఎక్కడా వాహనాలు ఆగకుండా చూడాలని చెప్పారు. కార్యక్రమంలో ఎర్రగొండపాలెం సీఐ ప్రభాకర్‌రావు, దోర్నాల ఎస్సై వి.మహేశ్ పాల్గొన్నారు.



పోలీసు సిబ్బందికి సూచనలిస్తున్న మార్కాపురం డీఎస్పీ నాగరాజు



పసుపుగల్లు శివాలయంలో నిర్వహిస్తున్న మహాకుంభాభిషేకం

శంభో శివశంభో!

- భక్తిభావంతో పులకించిన పసుపుగల్లు
- వైభవంగా అన్నపూర్ణాదేవి, కాశీవిశ్వేశ్వరస్వామి మహాకుంభాభిషేకం
- ఘనంగా నాభిశిల విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం

9లో

జంక్‌తున్నారు



- మారుతున్న నగర ప్రజల జీవన విధానం
- పిజ్జాలు, బర్గర్లకు దూరం
- పుల్కా రోటీ బండ్ల వద్ద పెరుగుతున్న రద్దీ
- నేడు ప్రపంచ ఆహార దినోత్సవం

9



తూర్పుగంగవరంలో ఈకేవైసీ చేస్తున్న డ్వామా సిబ్బంది (ఫైల్)

నత్తనడక

సగం కూడా పూర్తికాని ఉపాధి కూలీల ఈకేవైసీ

- రాష్ట్రంలో 21వ స్థానంలో జిల్లా
- 48మంది ఎఫ్‌ఏలకు షోకాజ్ నోటీసులు
- వచ్చేనెల 1 నుంచి ఈకేవైసీ పూర్తయిన వారికే పని

బోగస్‌కు చెక్ పెట్టేందుకే..

దేశవ్యాప్తంగా బోగస్ మస్టర్లకు చెక్ పెట్టేందుకు జాబ్ కార్డులలో నమోదై ఉన్న కూలీలందరికీ ఈకేవైసీ చేయాలని కేంద్రం నిర్ణయించింది. ఇది పూర్తయితే పనికి వాస్తవంగా హాజరైన కూలీల వేలిముద్ర లేదా కంటి పాపలు (ఐరిష్) ఆధారంగా మస్టర్ వేస్తారు. ఇంతటి ప్రాధాన్యత కలిగిన ప్రక్రియ జిల్లాలో ముందుకు సాగడం లేదు. క్షేత్రస్థాయిలో ఈ పథకం అమలులో కీలకంగా పనిచేసే ఫీల్డ్ అసిస్టెంట్లు, వారిని పర్యవేక్షించే మండల స్థాయి సిబ్బంది పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. జిల్లాలో ఉపాధి పథకానికి సంబంధించి సుమారు 4.49 లక్షల జాబ్‌కార్డులు ఉండగా వాటి పరిధిలో ఉన్న 8.21లక్షల మంది కూలీలకు ఈకేవైసీ చేయాల్సి ఉంది.

ఒంగోలు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఉపాధి హామీ కూలీల ఈకేవైసీ ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. ఈ నెలాఖరులోపు మొత్తం ప్రక్రియను పూర్తిచేయాల్సి ఉండగా ఇప్పటి వరకు సగం కూడా కాలేదు. రాష్ట్రంలో ఈకేవైసీ నమోదులో జిల్లా 21వ స్థానానికి పడిపోయింది. ఉపాధి హామీ పథకం అమలులో దేశవ్యాప్తంగా పెద్దఎత్తున అవినీతి, అక్రమాలు చోటుచేసుకుంటున్నాయి. చాలాచోట్ల కూలీలు పనులకు రాకపోయినా వచ్చినట్లు చూపుతున్నారు. కొన్నిచోట్ల చనిపోయిన వారి పేర్లు, విదేశాల్లో, దేశంలోని ఇతర రాష్ట్రాల్లో ఉద్యోగ, వ్యాపారాలు చేసుకుంటున్న వారి పేర్లతో మస్టర్లు వేస్తున్నారు. ఇలా క్షేత్రస్థాయిలోనే సిబ్బంది, స్థానిక అధికార పార్టీ నేతలు ఆయా మొత్తాలను స్వాహా చేస్తున్నారు. మన జిల్లాలోనూ ఇలాంటి పరిస్థితి అధికంగానే ఉంది.

అర్ధవీడులో అధికం.. దొనకొండలో అత్యల్పం

నవంబరు 1 నుంచి ఈకేవైసీ చేయించుకున్న వారికి మాత్రమే పనులు కల్పించాలని కేంద్రం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. అంటే ఈ నెలాఖరులోపు విధిగా ప్రక్రియ పూర్తిచేయాల్సి ఉంది. అయితే 20రోజులు గడిచినా జిల్లాలో ఈకేవైసీ సగం కూడా పూర్తికాలేదు. అధికారిక గణాంకాల ప్రకారం.. జిల్లాలో ఇప్పటి వరకు కేవలం 47.18శాతం మాత్రమే పూర్తి చేశారు. అత్యధికంగా అర్ధవీడు మండలంలో 64.41శాతం చేశారు. పెద్దారవీడు, కొమరోలు, రాచర్ల, బీపేట, కంభం, గిద్దలూరు, తర్లుపాడు, పొన్నలూరు, పుల్లలచెరువు, జరుగుమల్లి తదితర మండలాల్లో 50శాతం కన్నా అధికంగా పూర్తయింది. మిగిలిన మండలాల్లో ఆ లోపుగానే ఉంది. అతి తక్కువగా దొనకొండ మండలంలో 37.2శాతం, మార్కాపురంలో 39.32శాతం, కనిగిరిలో 41.09శాతం మాత్రమే జరిగింది. జిల్లాలోని 48 గ్రామాల్లో 30శాతం కూడా పూర్తికాలేదు. దీంతో ఆ గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లకు డ్వామా పీడీ జోసఫ్‌కుమార్ బుధవారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

బీఈడీ పరీక్షల్లో నలుగురు డీబార్

ఒంగోలు విద్య, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రకేసరి యూనివర్సిటీ పరిధిలో జరుగుతున్న బీఈడీ మూడో సెమిస్టర్ పరీక్షల్లో కాపీయింగ్‌కు పాల్పడుతున్న నలుగురు విద్యార్థులను డీబార్ చేసినట్లు యూనివర్సిటీ పరీక్షల అధికారి జి.సోమశేఖర్ తెలిపారు. పొదిలి పరిధిలోని కేంద్రాల్లో పరీక్షల్లో జోరుగా అక్రమాలు జరుగుతున్నట్లు మంగళవారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. దీనిపై ఒక రోజు ఆలస్యంగా యూనివర్సిటీ అధికారులు స్పందించారు. బుధవారం స్క్వాడ్ అధికారులను పొదిలికి పంపారు. వారు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. కాపీయింగ్‌కు పాల్పడుతున్న నలుగురు విద్యార్థులను డీబార్ చేశారు. మంగళవారం గిద్దలూరులో ఇద్దరు విద్యార్థులను డీబార్ చేశారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నకిలీ బీరు అంటూ వీడియో వైరల్

- పోస్ట్ చేసిన వారిని గుర్తించిన అధికారులు
- నోటీసులు జారీచేసిన ఎక్సైజ్ ఈఎస్

ఒంగోలు క్రైం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : నకిలీ బీరు అంటూ వీడియోను వైరల్ చేసిన ముగ్గురిని గుర్తించినట్లు జిల్లా ఎక్సైజ్ అధికారి ఎస్.ఆయేషాబేగం తెలిపారు. వారిలో ఇరువురికి నోటీసులు జారీ చేశామని, ఒకరు పరారీలో ఉన్నారని చెప్పారు. మంగళవారం స్థానిక కొప్పోలు రోడ్డులోని వైన్ షాపు వద్ద ఏపీ ఎక్సైజ్ సురక్షా యాప్‌లో బీరు బాటిల్ స్కాన్ చేయడంతో ఎర్రర్ వచ్చింది. దీంతో అది నకిలీ బీరు అంటూ సోషల్ మీడియాలో పోస్టు చేశారు. వెంటనే ఎక్సైజ్ యంత్రాంగం అప్రమత్తమై బీరుకు హీల్ స్టిక్కర్ ఉండదని, మద్యం బాటిళ్లను మాత్రమే ఏపీ ఎక్సైజ్ సురక్షా యాప్‌లో స్కాన్ చేయగలుగుతామని వివరణ ఇచ్చింది. నకిలీ బీర్లు అంటూ ప్రచారం చేసిన వారు కొప్పోలుకు చెందిన గద్దల రాజేంద్ర, ఒంగోలులోని కమ్మపాలెంనకు చెందిన రామినేని వెంకటకృష్ణ, గుత్తికొండవారిపాలెంనకు చెందిన పల్లపోగు వామనరెడ్డిగా గుర్తించారు. వీరిలో వెంకటకృష్ణ పరారీలో ఉన్నారు. రాజేంద్ర, వెంకటకృష్ణలకు నోటీసులు జారీచేశారు. 24 గంటల్లో సమాధానం ఇవ్వాలని కోరారు. ఏదైనా కుట్రపూరితంగా చేశారా? లేదా? అన్న అంశంపై వారిచ్చే సమాధానం తరువాత విచారణ చేస్తామని ఈఎస్ తెలిపారు.

రేపు జిల్లాస్థాయి సైన్స్ సెమినార్ పోటీలు

ఒంగోలు విద్య, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులోని డీఆర్‌ఆర్‌ఎం మునిసిపల్ హైస్కూలులో శుక్రవారం జిల్లా స్థాయి సైన్స్ సెమినార్ పోటీలు నిర్వహిస్తున్నట్లు డీఈవో కిరణ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పరిషత్, మునిసిపల్ ప్రభుత్వ యాజమాన్యాల్లోని పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు పాల్గొనవచ్చని తెలిపారు. ఉదయం 10గంటలకు పోటీలు ప్రారంభమవుతాయన్నారు. పూర్తి వివరాలకు జిల్లా సైన్స్ అధికారిని సంప్రదించాలని ఆయన కోరారు.

చేతుల శుభ్రతతో ఆరోగ్యానికి భద్రత

● ఎంపీడీవో రవికుమార్

నాగులుప్పలపాడు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): చేతులను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఆరోగ్యానికి ఎంతో భద్రత లభిస్తుందని ఎంపీడీవో తేళ్ల రవికుమార్ పేర్కొన్నారు. బుధవారం ప్రపంచ చేతుల పరిశుభ్రతా దినోత్సవాన్ని నాగులుప్పలపాడులోని జడ్పీ హైస్కూల్, అంబేడ్కర్‌నగర్‌లలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఆహార పదార్థాల తయారీ, భుజించే ముందు తప్పనిసరిగా సబ్బుతో గాని, లిక్విడ్ డిటర్జెంట్‌తో చేతులను తప్పనిసరిగా శుభ్రం చేసుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో చేతులు శుభ్రపరచుకొనే విధానాన్ని శాస్త్రీయ పద్ధతిలో చూపించారు.

జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో

సంతనూతలపాడు: జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో బుధవారం పేర్నమిట్ట జడ్పీహైస్కూల్లో హ్యాండ్‌వాష్‌డే దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యాకమిటీ కన్వీనర్ శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. చేతుల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. హెచ్‌ఎం పార్వతిశాంతి, ఉపాధ్యాయులు, జేవీవీ సభ్యులు పాల్గొన్నారు.

ముప్పవరంలో..

కొండపి: హ్యాండ్ వాష్ డే సందర్భంగా బుధవారం ముప్పవరం జడ్పీ స్కూల్‌లో నిర్వహించిన ఎంపీడీవో బి.రామాంజనేయులు అవగాహన కల్పించారు. విద్యార్థులు ఆహారం తినే ముందు, బహిర్భూమికి వెళ్లాక తప్పనిసరిగా చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ బత్తుల సులోచన, పంచాయతీ కార్యదర్శి రత్నప్రభ పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులతో చేతులు కడిగించారు.

కె.ఉప్పలపాడులో..

కె.ఉప్పలపాడులోని జడ్పీ స్కూల్‌లో సీడీపీవో బి.సుశీలాదేవి విద్యార్థులకు చేతుల శుభ్రతపై అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ విక్టోరియారాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సింగరబొట్లపాలెంలో..

పొన్నలూరు: సింగరబొట్లపాలెంప్రాథమిక పాఠశాలలో ఎంపీడీవో డాక్టర్ సుజాత చేతుల పరిశుభ్రత గురించి విద్యార్థులకు వివరించారు. డిప్యూటీ ఎంపీడీవో నారా యణ, రమణారెడ్డి, రాఘవరెడ్డి, హెచ్‌ఎం చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి గీత, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత



చెక్కును అందజేస్తున్న మంత్రి స్వామి

పొన్నలూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : సీఎం సహాయనిధి పేదలకు వరం అని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి పేర్కొన్నారు. ఇటీవల ప్రమాదానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పొన్నలూరుకు చెందిన పోతినేని అశోక్ కుటుంబానికి రూ.1.50లక్షల చెక్కును బుధవారం తూర్పు నాయుడుపాలెంలో మంత్రి అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పల్లపోతు ప్రసాద్ పాల్గొన్నారు.

మాగుంటకు జన్మదిన శుభాకాంక్షలు



ఎంపీ మాగుంటకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్న నాయకులు

కొండపి, అక్టోబరు15 (ఆంధ్రజ్యోతి): ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డికి నియోజకవర్గ టీడీపీ నాయకులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఒంగోలులోని ఆయన కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో వారు పాల్గొన్నారు. మాగుంటకు శుభాకాంక్షలు తెలిపిన వారిలో టీడీపీ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు గొర్రెపాటి రామయ్య చౌదరి, పార్టీ జరుగుమల్లి మండల అధ్యక్షుడు పోకూరి రవీంద్ర బాబు, పోటు శ్రీనివాసమురళి (పెదబాబు), జరుగుమల్లి మాజీ ఎంపీపీ పోటు పద్మావతి, నాయకులు గాలి సందీప్, నరాల సోమయ్య తదితరులు ఉన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : కేఎల్ డీమ్డ్ యూనివర్శిటీ విజయవాడ, హైదరాబాద్, బెంగళూరు క్యాంపస్‌లలో 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశానికి జాతీయ స్థాయిలో ప్రతిభ పరీక్షను నవంబరు 14నుంచి 18వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు యూనివర్శిటీ అడ్మిషన్స్ విభాగం డైరెక్టర్ జె.శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం ఒంగోలులోని శ్రీచైతన్య కళాశాల ఆవరణలో పోటీ పరీక్షల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ పరీక్షల్లో ప్రతిభావంతులైన విద్యార్థులకు రూ.100కోట్ల మేర మెరిట్ స్కాలర్‌షిప్‌లను అందజేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో యూనివర్శిటీ ప్రతినిధులు జేవీ.షణ్ముఖకుమార్, బి.శివరామకృష్ణ, చైతన్య కళాశాల డీన్ ఎం.రామకృష్ణ, ప్రిన్సిపాల్ వెంకటయ్య, రామాంజనేయులు, కె.రవికిషోర్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఓటీపీలు ఎవరికీ చెప్పకూడదు..

ఒంగోలు(రూరల్), అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): మొబైల్ ఫోన్‌లలో వచ్చే తెలియని లింక్‌లు ఓపెన్ చేయకూడదని, అలాగే ఓటీపీలను మరొకరికి చెప్పకూడదని జిల్లా సైబర్ సెక్యూరిటీ చీఫ్ కౌన్సిలర్ ప్రదీప్ పేర్కొన్నారు. బుధవారం ఒంగోలు ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ సైబర్‌నేరగాళ్ల బారిన పడితే వెంటనే పోలీసులను సంప్రదించాలన్నారు. కార్యక్రమలో ఎంపీడీవో రాజశేఖర్‌రావు, శేషుబాబు, ఏఈ రామ్‌ప్రసాద్, ఉద్యోగులు పాల్గొన్నారు.

సంక్షేమ నిధులను విడుదల చేయాలి

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ శాఖలకు నిధులను విడుదల చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని దళిత హక్కుల పోరాట సంఘం రా ష్ట్ర అధ్యక్షుడు చప్పిడి రవిశంకర్ డిమాండ్ చేశారు. స్థానిక కలెక్టరేట్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద బుధవారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుతం ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్లకు ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదని ఆరోపించారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించాలని కోరారు. కార్యక్రమంలో అబ్రహం, జాన్ వెస్లీ, ఏసుదాసు, ధనరాజ్, ఎస్‌కే.జిలాని, బ్రహ్మ, సామ్యేలు, మరియమ్మ, శాంతి, విజయలక్ష్మి పాల్గొన్నారు.





ముప్పా సురేష్‌కు బెయిల్

ఒంగోలు క్రైం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ నాయకుడు వీరయ్యచౌదరి హత్య కేసులో ప్రధాన సూత్రధారి ముప్పా సురేష్‌కు బుధవారం జిల్లా ప్రధాన న్యాయాధికారి భారతి బెయిల్ మంజురు చేశారు. ఈ కేసులో పోలీసులకు దొరకకుండా తప్పించుకు తిరిగిన నిందితుడు సురేష్ గత ఆగస్టు 18న పోలీసుల వద్ద లొంగిపోయాడు. ఈక్రమంలో అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించారు. దీంతో 58రోజులకు సురేష్ కోర్టులో బెయిల్ మంజూరు కాగా గురువారం విడుదల అయ్యే అవకాశం ఉంది.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఒంగోలు క్రైం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్‌ల మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 7 నుంచి 11 గంటల వరకు నగరంలోని కొన్ని ప్రాంతాల్లో కరెంటు సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈ పాండురంగారావు ఓ ప్రకటనలో తెలిపారు. 11 కేవీ రాజపానగల్ రోడ్ ఫీడర్, 11 కేవీ గొడుగుపాలెం ఫీడర్‌లో గల కోర్టుసెంటర్, సెంట్రల్ కేఫ్, శ్రీగిరి కొండమీద, రాజపానగల్‌రోడ్డు, జమ్మిచెట్టుబజారు, సాయిబాబా టెంపుల్ ఎదురు, గద్దలగుంట తదితర ప్రాతాలలో కరెంటు సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

పేస్‌లో విద్యార్థులకు వర్క్‌షాప్

ఒంగోలు విద్య, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం ట్రిపుల్‌ఈ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు పీసీబీ డిజైన్‌పై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటసుమంత్ విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్ మాట్లాడుతూ విద్యార్థులకు సాంకేతిక పరమైన అభివృద్ధి కోసం కళాశాలలో నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జీవీకే.మూర్తి, విభాగాధిపతి నాగరాజు పాల్గొన్నారు.

శ్రీహర్షిణి కళాశాలలో..

స్థానిక శ్రీహర్షిణి మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో మాజీ రాష్ట్రపతి ఏపీజే.అబ్దుల్‌కలాం జయంతిని పురస్కరించుకొని బుధవారం విద్యార్థులకు వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా డీడీ సప్తగిరి ప్రోగ్రామ్ ప్రతినిధి విజయలక్ష్మి పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ గోరంట్ల రవికుమార్, డైరెక్టర్ జి.హర్షిత, వైస్ ప్రిన్సిపాల్ సందీప్‌చక్రవర్తి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ కానిస్టేబుళ్ల కుటుంబాలకు చేయూత

ఒంగోలు క్రైం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ఎక్సైజ్ శాఖ కానిస్టేబుళ్లు ఎం.శ్రీనివాసరావు, డి.సుబ్బారావు మృతి చెందడంతో వారి కుటుంబాలకు ఆ శాఖ కానిస్టేబుళ్లు, హెడ్‌కానిస్టేబుళ్లు అండగా నిలిచారు. ఒక్కో కుటుంబానికి రూ.74 వేలు చొప్పున ఇరు కుటుంబాలకు రూ.1.48లక్షలను బుధవారం ఒంగోలులోని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలో డిప్యూటీ మిషనర్ హేమంత నాగరాజు చేతులు మీదుగా అందజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ కె.విజయ, జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి ఆయేషాబేగం, జిల్లా ఎక్సైజ్ అండ్ ప్రొహిబేషన్ కానిస్టేబుళ్ళు, హెడ్ కానిస్టేబుళ్ల అసోసియేషన్ అధ్యక్షుడు పి.శ్రీనివాసులు, జనరల్ సెక్రటరీ ఎస్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు శ్రీగిరిలో సుదర్శన హోమం

ఒంగోలు కల్చరల్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీగిరిలోని శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానంలో గురువారం సుదర్శనహోమం నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్‌పర్సన్ ఆలూరు ఝాన్సీరాణి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్త ఆలూరు వెంకట రమణారావు జయంతి సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఉదయం 7.30కు పూలంగి సేవ, వెంకట రమణారావు విగ్రహానికి అభిషేకం, సుదర్శనహోమం, మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ ఉంటాయన్నారు. సుదర్శన హోమంలో పాల్గొనదలచిన భక్తులు 9390967258 సెల్ నంబరులో సంప్రదించాలని కోరారు.

ట్రంప్ విధానాలు ప్రమాదకరం

నాగులుప్పలపాడు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించే సుంకాలు భారతదేశానికి ప్రమాదకరమని సీపీఎం జిల్లా నాయకులు ఎస్‌కే.మాబు, జుజ్జూరి జయంతి బాబు ఆందోళన వ్యక్తం చేశారు. పార్టీ మండల కార్యదర్శి తూబాటి శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఉప్పుగుండూరు బస్టాండ్ సెంటర్ వద్ద బుధవారం రాత్రి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటికే ట్రంప్ విధించిన 60 శాతం సుంకాలతో దేశంలోని ఆక్వారైతులు నష్టాలు చవిచూశారన్నారు. అమెరికా సామ్రాజ్యవాదాన్ని, ట్రంప్ సుంకాల యుద్ధానికి వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. అనంతరం ట్రంప్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో నాయకులు జి.బసవపున్నయ్య, ఎన్.రామారావు, యు.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఉపాధి పనులను గుర్తించాలి

ఒంగోలు(రూరల్), అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఉపాధి పనులను గుర్తించి వాటికి సంబంధించిన వివరాలు తెలిపాలని ఏపీవో నాగేశ్వరరావు కోరారు. బుధవారం ఒంగోలు మండలం దశరాజుపల్లి గ్రామంలో ఆయన గ్రామస్థులతో సమావేశం నిర్వహించారు. నవంబరు నుంచి ఉపాధి పనులు ప్రారంభమవుతాయని, అందువల్ల గ్రామంలో చేపట్టే పనులను తెలియజేయాలని ఆయన సూచించారు. కాగా స్థానిక చెరువులు, నీటికుంటలు పూడికతీత పనులు, డొంకల మార్జిన్లను బాగు చేయాలని గ్రామస్థులు కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మాలంపాటి యానాదినాయుడు, పాలేటి ప్రభాకర్, పులిచెర్ల మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు

ముక్తిపథం భాగవత పఠనం

ఒంగోలు కల్చరల్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): పోతన మహాకవి రచించిన భాగవతాన్ని పఠించినా, శ్రవణం చేసినా ముక్తిపథం ప్రాప్తిస్తుందని ప్రముఖ ఆధ్యాత్మిక ఉపన్యాసకులు ఎంవీఎస్.శాస్త్రి పేర్కొన్నారు. ఒంగోలు నగరం దక్షిణంబజారులోని శ్రీవేణుగోపాలస్వామి దేవస్థానంలో బుధవారం ఏర్పాటు చేసిన భాగవత కథా సుధాలహరి కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. భగవంతుని దివ్య చరణాలను ఆశ్రయించాలని, త్రికరణశుద్ధితో అర్చిస్తే మోక్షాన్ని పొందవచ్చన్నారు. భాగవతం భగవంతుని స్వరూపంగా పద్మపురాణం పేర్కొందని, శ్రీమహావిష్ణువు ప్రతిరూపమే భాగవతమని ఉద్బోధించారు. భాగవతంలో ప్రహ్లాదుడు, ధ్రువుడు, గజేంద్రుడు, అంబరీషుడు, బలిచక్రవర్తి మొదలైన వారి గాథలు శ్రీమహావిష్ణువు మహిమలను వెల్లడిస్తున్నాయన్నారు. అనంతరం ఎంవీఎస్.శాస్త్రిని అర్చకులు శ్రీనివాసాచార్యులు, సంతవేలూరి కోటేశ్వరరావు ఘనంగా సత్కరించారు.



స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

మద్దిపాడు, అక్టోబర్ 15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేస్తుందని టీడీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ మండవ జయంత్‌బాబు అన్నారు. బుధవారం బసవన్నపాలెంలో స్మార్ట్ కార్డులను ఆయన పంపిణీ చేశారు. కొప్పోలు విశ్వనాథం, వీరాంజనేయులు, ప్రభాకరరావు, గోవిందరాజులు, లక్ష్మీనారాయణ, పాల్గొన్నారు.







జంకుతున్నారు!

- మారుతున్న నగర ప్రజల జీవన విధానం
- పిజ్జాలు, బర్గర్లకు దూరం
- పుల్కా, రోటీ బండ్ల వద్ద పెరుగుతున్న రద్దీ
- నేడు ప్రపంచ ఆహార దినోత్సవం

నగర ప్రజల జీనవ విధానం మారింది. జంక్ ఫుడ్‌లంటే భయపడిపపోతున్నారు. రంగుపూసిన చైనీస్ వంటకాలంటే వెనుకడుగు వేస్తున్నారు. ప్రతి ఒక్కరిలో ఆరోగ్యం పట్ల శ్రద్ధ పెరిగింది. మితాహారమే మేలంటూ మధ్యతరగతి వారికి అందుబాటులో ఉండే ఆనాటి ఆహార పదార్థాలు ఆటా పిండి వంటలవైపు ఆసక్తి చూపుతున్నారు. ఒంగోలు నగరంలో ఒకప్పుడు జన సంచారం లేని మంగమూరు రోడ్డు మారుమూల సెంటర్‌గా కనిపించేంది. అయితే ప్రస్తుతం ఆ సెంటర్‌లో అడుగుపెట్టాలంటే ఆలోచించాల్సిన పరిస్థితి. జన సంచారం పెరిగింది. వ్యాపార సంస్థలు వెలిశాయి. ప్రత్యేకించి, విద్యా సంస్థలు ఇబ్బడిముబ్బడిగా పెరిగాయి. నేడు ప్రపంచ ఆహార దినోత్సవం సందర్భంగా ప్రత్యేకం..



ఒంగోలు కార్పొరేషన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : నగర జీవన విధానం మారిపోయింది. ఒంగోలులోని గాంధీనగర్, నిర్మల్ నగర్, లాయరుపేట, రాజీవ్ నగర్, రెవెన్యూ కాలనీ, జర్నలిస్ట్ కాలనీ, మంగమూరు గ్రామాలకు చెందిన పలువురు ఉద్యోగులు, వ్యాపారులు, రైతులకు కేరాఫ్ సెంటర్‌గా మారిపోయింది. దీంతో చిరువ్యాపారాలు అందుబాటులోకి వచ్చాయి. మారుతున్న కాలం.. పెరుగుతున్న ఒంటి తీరు.. అంతకు మించి ఆరోగ్యం పట్ల దృష్టి సారించేవారితో ఆ రోడ్డు కిక్కిరిసిపోతోంది. కేవలం మంగమూరు రోడ్డులోనే కాకుండా బాపూజీ మార్కెట్ కాంప్లెక్స్, నెల్లూరు బస్టాండ్, మార్కెట్ సెంటర్, జాతీయ రహదారి వెంట ఇలా నిత్యం వేల సంఖ్యలో జన సంచారం ఉండే ప్రాంతాల్లో పుల్కా. రాగి రొట్టెల వ్యాపారాలకు గిరాకీ పెరిగింది. దీంతో సాయంత్రం 5గంటల నుంచి రాత్రి పది గంటల వరకు పాయింట్‌ల వద్ద సందడి వాతావరణం కనిపిస్తోంది. మధ్యతరగతి నుంచి ఉన్నత వర్గాలకు చెందిన వారు సైతం నూనె లేని వంటనే ఇష్టపడుతున్నారు. అందుబాటులో లభిస్తున్న పుల్కా, రోటీ, రాగి, జొన్న రొట్టెల కోసం బారులు తీరుతున్నారు. అతి తక్కువ ధరకు అందరికీ అందుబాటులో ఉండే పుల్కాలను ఆరగించేందుకు అధిక శాతం జనాభ ఆసక్తి చూపుతున్నారు. గోధుమ పిండితో తయారయ్యే పుల్కా, రోటీలలో అధిక శాతం మాంసకృతులు, పిండి పదార్థాలు ఉండటంతోపాటు, మనిషి శరీరానికి ఎక్కువ శక్తినిస్తాయని ప్రజలు వెల్లడిస్తున్నారు. నోరూరించే రుచులతో పుల్కా, చపాతీలవైపు ఆసక్తి చూపుతుండగా, అత్యధిక జనాభా రాగి, జొన్న రొట్టెలను ఇష్టపడుతున్నారు. అందులోనూ వాటికి జతగా పాలకూర, ఆకు కూర పప్పులు, టమోటా, కాజూనట్ ఇలా మాంసం లేని అచ్చతెలుగు శాఖాహార కూరలతో లభించే ఆహారం పట్ల ఆసక్తి చూపుతున్నారు. నగరంలోని ప్రధాన వీధులన్నింటిలోనూ అత్యధికంగా ఈ తరహా వ్యాపారాలే దర్శనమిస్తున్నాయి. దీంతో అటు చిరువ్యాపారుల యజమానులకు జీవనోపాధి లభిస్తుండగా, మరోవైపు నగర ప్రజల ఆరోగ్యానికి అభద్రతా భావం ఉండదన్న భరోసా అత్యధికుల్లో కనిపిస్తోంది. సుమారు 400లకుపైగా ఇలాంటి తరహా వ్యాపారాలు ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. ప్రజల ఆలోచనా విధానానికి అనుగుణంగా వెలసిన పుల్కా, అల్పాహార టిఫిన్ సెంటర్ల ఏర్పాటుతో యువతకు ఉపాధి కేంద్రాలుగా మారాయి. వైద్యులు సైతం సాయంత్రం వేళ మితాహారమే మంచిదని సూచించడంతో ఈ వ్యాపారాలకు గిరాకీ పెరిగిందనే చెప్పొచ్చు. మహిళలు, విద్యార్థులు, యువత, ఉద్యోగులు. వ్యాపారుల ఇలా ఒకరేమిటి అన్నీ వర్గాల ప్రజలకు గోధుమ పిండితో చేసిన వంటకాలు చిన్నపాటి ఆరోగ్య అల్పాహార కేంద్రాలుగా మారాయి.



ధ్వజ స్తంభానికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

శంభో శివశంభో!

- భక్తిభావంతో పులకించిన పసుపుగల్లు
- వైభవంగా అన్నపూర్ణాదేవి, కాశీవిశ్వేశ్వరస్వామి మహాకుంభాభిషేకం
- ఘనంగా నాభిశిల విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం

ముండ్లమూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పసుపుగల్లు గ్రామంలోని శ్రీఅన్నపూర్ణాదేవి, కాశీవిశ్వేశ్వరస్వామి మహాకుంభాభిషేకంతోపాటు నాభిశిల(బొడ్డు రాయి) విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం బుధవారం కన్నుల పండువగా జరిగింది. గ్రామస్థులు రూ.30 లక్షలకుపైగా విరాళాలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈనెల 11 నుంచి 15వ తేదీ వరకు ఐదు రోజుల పాటు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. చివరి రోజైన బుధవారం మహాకుంభిషేకం, పూర్ణాహుతి, కలశాల పూజా మహోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి 15వేల మందికి పైగా భక్తులు హాజరయ్యారు. ఉదయం 8:49 గంటలకు నాబిశిల విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. 11:20 గంటల సమయంలో మహాకుంభాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు కలశాలతో ఊరేగింపుగా కుంభాభిషేకంలో పాల్గొన్నారు. అనంతరం ధ్వజ స్తంభానికి పూజలు చేశారు. 15 వేల మందికి పైగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, లలిత్‌సాగర్ దంపతులు, జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. సీఐ వై.రామారావు పర్యవేక్షణలో ఎస్ఐ కే కమలాకర్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.



నాభిశిల విగ్రహానికి పూజలు నిర్వహిస్తున్న దర్శి టీడీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, లలిత్ సాగర్ దంపతులు



హ్యాండ్‌వాష్‌పై ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

చేతుల శుభ్రంతో ఆరోగ్యం, ఆనందం

- డీఈవో కిరణ్‌కుమార్

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : చేతులను శుభ్రంగా కడుక్కోవడం ద్వారా ఆరోగ్యంగానూ, ఆనందంగానూ ఉంటారని జిల్లా విద్యాశాఖాధికారి కిరణ్‌కుమార్ అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని మీ కోసం హాలులో బుధవారం గ్లోబల్ హ్యాండ్‌వాష్‌డే కార్యక్రమాన్ని విజయవాణి చారిటబుల్ ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. క్రమశిక్షణతో జీవితాన్ని ముందుకు నడిపించాలంటే ఆరోగ్యంతో మాత్రమే సాధ్యమవుతుందని తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ చేతులు శుంగా చేసుకోవడం ద్వారా వార్మింగ్ టాబ్లెట్లు వేసుకోవాల్సిన అవసరం ఉండదన్నారు. డబ్ల్యూహెచ్ఓ సూచించిన విధంగా ఏడు రకాలుగా చేతులను శుభ్రం చేసుకోవాలని తెలిపారు. మెప్మా పీడీ శ్రీహరి మాట్లాడుతూ మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంటుందన్నారు. రాష్ట్ర ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ వీరభద్రుడు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు పరిసరాలతోపాటు వ్యక్తిగత శుభ్రతను కూడా పాటించాలని తెలిపారు. ఈ సందర్భంగా హ్యాండ్ వాష్‌పై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో స్టెప్ సీఈవో శ్రీమన్నారాయణ, ఐసీడీఎస్ పీడీసువర్ణ, విజయవాహిని చారిటబుల్ ఫౌండేషన్ జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ టి. రంగారావు, వాస్ జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీనివాసరావు, ప్రోగ్రాం ప్రతినిది కే మరియుబాబు తదితరులు ఉన్నారు.

క్రమశిక్షణా చర్యలు రద్దు చేయాలి



నిరసన తెలుపుతున్న ఆలిండియా గ్రామీణ డాక్ సేవక్స్ యూనియన్ నాయకులు, కార్యకర్తలు

ఒంగోలు కార్పొరేషన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ తపాల ఉద్యోగుల సంఘం జాతీయ నాయకుడు ఎస్ఎస్.మహదేవయ్యపై కేంద్ర ప్రభుత్వం తీసుకున్న క్రమశిక్షణా చర్యల రద్దు చేసి విధుల్లోకి తీసుకోవాలని ఆలిండియా గ్రామీణ డాక్ సేవక్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం ఒంగోలులోని హెడ్ పోస్టాఫీస్ వద్ద మహదేవయ్యకు మద్దతుగా నిరసన ప్రదర్శన చేపట్టారు. కార్యక్రమంలో డివిజనల్ ప్రెసిడెంట్ ఎస్.శ్రీనివాసకుమార్, సర్కిల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పి. వెంకటేశ్వరరావు, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు ఎ.శైలజ, యూనియన్ నాయకులు వాణి, విజయ్‌కుమార్, కృష్ణాంజనేయులు, వెంకటేశ్వర్లు, పేరయ్య పాల్గొన్నారు.

ఘనంగా మాగుంట జన్మదిన వేడుకలు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి జన్మదిన వేడుకలు బుధవారం ఒంగోలులో ఘనంగా జరిగాయి. తన కుమారుడు మాగుంట రాఘవరెడ్డితో కలిసి ఆయన వేడుకల్లో పాల్గొన్నారు. వచ్చే ఎన్నికల్లో తన కుమారుడు మాగుంట రాఘవరెడ్డి పార్లమెంట్ సభ్యుడిగా పోటీ చేస్తారని ఒంగోలు ఎంపీ ప్రకటించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వచ్చే ఎన్నికల్లో తన కుమారుడిని ఎంపీని చేస్తానని మాటిచ్చారని వెల్లడించారు. బుధవారం స్థానిక రామనగర్‌లోని తన కార్యాలయంలో బుధవారం ఆయన జన్మదిన వేడుకలు జరిగాయి. ఎంపీ మాగుంట మాట్లాడుతూ రాఘవరెడ్డి ఈ ప్రాంతంలో ఎంపీగా ఉండి సేవ చేయాల్సిన అవసరం ఉందన్నారు. అందుకు తమ కుటుంబం కూడా అండగా ఉంటుందని తెలిపారు. ఎంపీ మాగుంటకు రాజకీయ నాయకులు, అధికారులు, వివిధ రంగాల్లోని ప్రముఖులు కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ముందుగా అభిమానులు ఏర్పాటు చేసిన కేక్‌ను తన కుమారులు మాగుంట రాఘవరెడ్డి, మాగుంట నిఖిల్‌రెడ్డితో కలిసి కట్ చేశారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డిఎస్‌బీవీ స్వామి, సంతనూతలపాడు శాసనసభ్యుడు బిఎన్ విజయకుమార్, ఒడా చైర్మన్ షేక్ రియాజ్, పర్యాటకశాఖ చైర్మన్ నూకసాని బాలాజీ, పీడీసీసీ బ్యాంకు చైర్మన్ డాక్టర కామేపల్లి ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు, మాజీ ఎమ్మెల్యే బాచిన చెంచు గరటయ్య, టీడీపీ నాయకులు అయినాబత్తిన ఘనశ్యాం, తాతా ప్రసాద్, కుప్పా రంగసాయి, బెల్లం సత్యనారాయణ శుభాకాంక్షలు తెలిపారు.



ఎంపీ మాగుంట జన్మదిన వేడుకల్లో పాల్గొన్న టీడీపీ, జనసేన నేతలు



ఎంపీ మాగుంటకు శుభాకాంక్షలు చెబుతున్న మంత్రి స్వామి

- మాగుంటను కలిసి శుభాకాంక్షలు తెలిపిన వారిలో టీడీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ లక్ష్మి, నాయకులు డాక్టర్ సాగర్ ఉన్నారు. కర్నూలు ప్రధాని సభ ఏర్పాట్లలో ఉన్న రాష్ట్ర మంత్రులు గొట్టిపాటి రవికుమార్, బీసీ జనార్దన్‌రెడ్డి, జిల్లాకు చెందిన శాసనసభ్యులు దామచర్ల జనార్దన్, ఉగ్రనరసింహారెడ్డి, అశోక్‌రెడ్డి, నారాయణరెడ్డి, మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, టీడీపీ ఎర్రగొండపాలెం నియోజకవర్గ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు వీడియో కాల్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.

‘ఉపాధి’ కల్పనే లక్ష్యంగా పనిచేయాలి

- కలెక్టర్ రాజాబాబు ఆదేశం

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : నైపుణ్యాభివృద్ధి ద్వారా ఉపాధి అవకాశాల కల్పనే ధ్యేయంగా పరిశ్రమలు, అనుబంధ విభాగాలు పనిచేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాజాబాబు ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో బుధవారం ఆయాశాఖల అధికారులతో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ముందుగా జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ శ్రీనివాసరావు జిల్లాలో పరిశ్రమల స్థితిగతులు, కొత్తవాటిని స్థాపించేందుకు ఉన్న అవకాశాలు తదితర అంశాలను ఈ సందర్భంగా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టర్ రాజాబాబు మాట్లాడుతూ కేవలం శిక్షణకే పరిమితం కాకుండా వ్యాపారాలను విస్తరించేందుకు అవసరమైన డీపీఆర్ ప్రణాళిక, బ్యాంకు రుణాల మంజూరు వంటి ప్రక్రియ పూర్తయ్యేంత వరకు తోడుగా నిలవాలన్నారు. ముడి సరుకుల లభ్యతనుంచి ఉత్పత్తుల మార్కెటింగ్ వరకు అవసరమైన సహకారాన్ని అందించాలన్నారు. సమావేశంలో ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ మదన్ తదితరులు ఉన్నారు. పారిశ్రామిక రంగంలో పెట్టుబడులను ప్రోత్సహించేందుకు ఏపీఐఐసీ ఇండస్ట్రీ భాగస్వామ్య డ్రైవ్ పేరుతో బుధవారం నుంచి నవంబరు 15వ తేదీ వరకు నిర్వహించనున్న ప్రత్యేక కార్యక్రమాల పోస్టర్‌ను కలెక్టర్ రాజాబాబు ఆవిష్కరించారు.



ఏపీఐఐసీ ఇండస్ట్రీ భాగస్వామ్య డ్రైవ్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రాజాబాబు

రోజువారీ రిజిస్ట్రేషన్ వివరాలను పంపాలి : కలెక్టర్

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ప్రతిరోజూ జరిగే రిజిస్ట్రేషన్ల వివరాలను కలెక్టరేట్‌కు పంపించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాజాబాబు ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో బుధవారం సాయంత్రం రిజిస్ట్రేషన్ల శాఖ అధికారులతో జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం, జిల్లాలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వారీగా వచ్చిన ఆదాయం, రిజిస్ట్రేషన్ అనంతరం మ్యుటేషన్, నిషేధిత భూముల వివరాలు తదితర అంశాలను జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనేయులు కలెక్టర్‌కు వివరించారు. ఆయా అంశాలపై కలెక్టర్ మాట్లాడుతూ గతంలో జిల్లాలో ఫోర్జరీ సంతకాలు, నకిలీ స్టాంపులతో జరిగిన భూ కుంభకోణంపై దిశానిర్దేశం చేశారు. తమ భూమి తమ ఆధీనంలోనే ఉన్నా వెబ్‌ల్యాండ్‌లో ఇతరుల పేర్లు ఉన్నట్లు మీ కోసంలో ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. తప్పుడు రిజిస్ట్రేషన్లపై సరైన చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేసే విధంగా ప్రభుత్వం అవకాశం కల్పించినందున రోజువారీగా భూముల రిజిస్ట్రేషన్ వివరాలను కలెక్టరేట్‌కు పంపించాలని ఆదేశించారు. భూఆక్రమణలకు, అక్రమ రిజిస్ట్రేషన్లకు అడ్డుకట్ట వేసేలా ఈ వివరాలను పరిశీలించేందుకు కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా సిబ్బందిని నియమిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.

దేవాలయాల అభివృద్ధికి పాటుపడాలి

ఒంగోలు కలెక్టరేట్,అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని దేవాలయాల అభివృద్ధితో పాటు ఆదేవాలయాల చరిత్ర, సంస్కృతి, సాంప్రదాయాలు, జాతర్లు, ఉత్సవాలు ప్రజలకు తెలిసేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పీ రాజాబాబు ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో బుధవారం దేవాదాయశాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో దేవదాయ శాఖ పరిధిలో 1001 ఆలయాలు, సత్రాకలు ఉన్నాయని అందులో 12 పురాతన, చారిత్రక ఆలయాలు ఉన్నాయని దేవాదాయశాఖ అధికారులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. జిల్లాలో 38,866.95 ఎకరాల భూమి దేవదాయశాఖ పరిధిలో ఉందని తెలిపారు. దీనిపై స్పందించిన కలెక్టర్ రాజాబాబు మాట్లాడుతూ జిల్లాలో దేవాలయాల అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక రూపొందించాలన్నారు.



ప్రసాద్ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబీకులు

గల్లంతయిన వ్యక్తి మృతదేహం లభ్యం

తాళ్లూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెలుగువారిపాలెం పంచాయతీ రెడ్డి సాగర్ వద్దగల ఒంగోలు బ్రాంచి కెనాల్‌లో మంగళవారం గల్లంతైన మెలికా ప్రసాద్ మృతదేహం బుధవారం లభ్యమైంది. ప్రసాద్ చేపలు పట్టేందుకు దిగిన ప్రాంతంలో చేయి బురదలో కూరుకపోయి బయటకు రాలేక మృతి చెందాడు. కాలువ ఉధృతంగా ప్రవహిస్తుండటంతో మృతుడు ప్రసాద్ బంధువులు అతికష్టం మీద వెలుపలకు తీసుకొచ్చారు. మృతదేహాన్ని చూసి కుటుంబీకులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. వీఆర్‌వో తప్పెట్ల చెన్నకృష్ణయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

జీఎస్టీ తగ్గుదలతో అందుబాటులోకి వస్తువులు

- రాష్ట్ర డిప్యూటీ కమిషనర్ సత్యప్రకాష్



సైకత శిల్పాన్ని తిలకిస్తున్న సత్యప్రకాష్

కొత్తపట్నం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ రేటు శ్లాబులను రెండు స్లాబులకు తగ్గించటం వల్ల అనేక వస్తువుల ధరలు తగ్గాయని, ఈ మర్పును ప్రజలు గుర్తించి ప్రయోజనం పొందాలని రాష్ట్ర జీఎస్టీ డిప్యూటీ కమిషనర్ ఎం.సత్యప్రకాష్ అన్నారు. బుధవారం ఆయన కొత్తపట్నం పల్లెపాలెంలో జీఎస్టీ శ్లాబులపై ఏర్పాటు చేసిన సైకత శిల్పాన్ని తిలకించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలనుద్దేశించి ప్రసగించారు. ప్రజలు జీఎస్టీలో వచ్చిన మార్పులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. జీఎస్టీని తగ్గించటంతో మార్కెట్లో ఉండే ఎక్కువ వస్తువుల ధరలు తగ్గియాని, ఈ విషయంపై ప్రజలు అవగాహన పెంచుకుని ప్రయోజనం పొందాలని కోరారు. సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ క్యాంపెయిన్‌లో భాగంగా తీరంలో ఈ సైకత శిల్పాన్ని ఏర్పాటు చేశారు. సాగర మిత్రలు, కె పల్లెపాలెం గ్రామ పంచాయితీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ సైకత శిల్పాన్ని తరలించేందుకు స్థానికులు ఆసక్తి చూపించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సత్యప్రకాష్ వెంట ఒంగోలు సర్కిళ్ల అసిస్టెంట్ కమిషనర్లు, మండల అభివృద్ధి అధికారి శేషుబాబు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	123, 132, 142
చికెన్ విత్ స్కిన్(కిలో)	230.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	240.00

కానరాని వంతెనలు

» పశ్చిమ ప్రకాశంలో వరదొస్తే తప్పని ఇక్కట్లు

కంభం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : పశ్చిమ ప్రకాశంలో ఈ ఏడాది ఇప్పటివరకు ఆశించిన మేర వర్షాలు కురవకున్నా ఆయా గ్రామాల పరిధిలో ఉన్న నల్లమల అడవుల్లో కురిసే మోస్తరు వర్షాలకు వాగులు ఉధృతంగా ప్రవహిస్తూ రాకపోకలకు అంతరాయం కలిగిస్తున్నాయి. పశ్చిమ ప్రకాశంలోని గిద్దలూరు, ఎర్రగొండపాలెం, మార్కాపురం నియోజకవర్గాల పరిధిలోని అర్ధవీడు, కంభం, రాచర్ల, గిద్దలూరు, పెద్దారవీడు, పెద్ద దోర్నాల, మార్కాపురం, రావిపాడు, తర్లుపాడు, తదితర మండలాల్లోని జంపలేరు, గుండ్లకమ్మ, నగిలేరు, నల్లవాగులు ప్రవహిస్తున్నాయి. ఈ వాగులకు వరద నీరు పోటెత్తినప్పుడు ఆయా మండలాల్లోని అనేక కల్వర్టులు, నేల చప్టాలు నీట మునిగి రాకపోకలు నిలిచిపోతున్నాయి. వరద వచ్చినప్పుడు సంబంధిత అధికారులు హడావుడిగా ప్రతిపాదనలు తయారు చేయడం, ఆ తరువాత పక్కన పెట్టేయడం జరుగుతుంది. వరదల తాకిడికి దెబ్బతిన్న వంతెనలకు కనీస మరమ్మతులు కూడా చేయడం లేదు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ముఖ్యంగా అర్ధవీడు మండలంలోని అయ్యవారిపల్లి గ్రామ సమీపంలో కల్వర్టుపై నుంచి ప్రవహించే నీరు జంపలేరు వాగు వలన గంటల తరబడి రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఆ ప్రాంతంలోని మూడు గ్రామాల విద్యార్థులు, ఉద్యోగులు, ప్రజలు వంతెన దాటి వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నారు. ఇక ఇదే మండలంలోని బొల్లుపల్లి, అచ్చంపేట గ్రామ ప్రజలది మరో దయనీయమైన పరిస్థితి. ఒక్కోసారి ఈ వంతెన పైనుంచి ప్రవహించే వరద ప్రవాహం రెండు రోజుల వరకు తగ్గదు. ఆ గ్రామస్థులకు మరో ప్రత్యామ్నాయ మార్గం లేకపోవడంతో ఏ అవసరం వచ్చినా వంతెన వద్ద ప్రవాహం తగ్గేవరకు వేచి ఉండాల్సిందే. కల్వర్టుల ఎత్తు పెంచాలన్నది ప్రతిపాదనలకే పరిమితమవుతున్నదని గ్రామస్తులు వాపోతున్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలోనైనా మా బాధలు తీరుతాయేమోనని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.


అయ్యవారిపల్లి వద్ద కల్వర్ట్‌పై ప్రవహిస్తున్న వరద ముందు గ్రామస్థులు


బొల్లుపల్లి వద్ద కల్వర్ట్ వద్ద ప్రవహిస్తున్న వరద ప్రవాహం

పంచారామాలకు ప్రత్యేక బస్సులు

పొదిలి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : పొదిలి ఆర్టీసీ డిపో నుంచి కార్తీకమాసం సందర్భంగా పంచారామాలకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డీఎం శంకరరావు బుధవారం తెలిపారు. డిపో పరిధిలో ఎక్కడ నుంచైనా శైవక్షేత్రాల ప్రదర్శన కోసం పంచారామాలు, అరుణాచలం, శ్రీశైలం పుణ్యక్షేత్రాలకు వెళ్లే భక్తుల కోసం బస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కోరినరోజుకు బస్సును ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. అదే విధంగా 19వ తేదీ ఆదివారం నుంచి ప్రతి ఆదివారం పాకలబీచ్‌కు ప్రత్యేక బస్సు నడపనున్నట్లు చెప్పారు.

అక్రమ నిర్బంధంపై నిరసన

గిద్దలూరు టౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పొగుళ్ల గ్రామానికి చెందిన మేకల తిమ్మయ్యను అటవీశాఖ అధికారులు అక్రమంగా నిర్బంధించారని ఆయన బంధువులు స్థానిక అటవీశాఖ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. 20 రోజుల కిందట మేకల తిమ్మయ్య మేకలు మేపుకునేందుకు కొండకు వెళ్లగా రేసు కుక్కలు చంపిపడేసిన కొండముచ్చును చూసి దాని మాంసాన్ని ఇంటికి తెచ్చుకోగా అటవీ శాఖ అధికారులు ఈవిషయంపై కేసు నమోదు చేశారని, అయితే ఇతరులు చెప్పిన మాటలు విని తిమ్మయ్యను విచారణ పేరుతో హింసిస్తున్నారని బంధువులు వాపోయారు.

గూగుల్ డేటా సెంటర్ దేశానికే తలమానికం

టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు

త్రిపురాంతకం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : ప్రజా ప్రభుత్వ పాలనలో యువతకు ఉపాధి లక్ష్యంగా అనేక రంగాల్లో మార్పులు జరుగుతున్నాయని అందులో భాగంగా విశాఖలో గూగుల్ డేటా సెంటర్ దేశానికే తలమానికంగా ఉండబోతోందని టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్ బాబు అన్నారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ కృషితో విశాఖ నగరం డేటా హబ్ సెంటరుగా ఎదుగుతోందని ఒక ప్రకటనలో తెలిపారు. గత పాలనలో వైసీపీ నాయకులు ఐటీ కంపెనీలకు ఇవ్వాల్సిన రాయితీలు, ప్రోత్సాహకాలు ఇవ్వని కారణంగా కంపెనీలు రాష్ట్రం నుంచి వెళ్లిపోయాయని అన్నారు. కానీ కేవలం 16 నెలల్లోనే విశాఖకు రూ.6.50లక్షల కోట్లు పెట్టుబడులు తెచ్చిన ఘనత కూటమి ప్రభుత్వానిదని ఆయన చెప్పారు. రాబోయే రోజుల్లో విశాఖ కేంద్రంగా యువతకు భారీగా ఐటి ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా మంత్రి లోకేష్ కృషి చేస్తున్నారని ఎరిక్షన్‌బాబు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి


అర్జీలను స్వీకరిస్తున్న టీడీపీ నేత కృష్ణకిషోర్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని టీడీపీ నేత ముత్తుముల కృష్ణకిషోర్‌రెడ్డి సూచించారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో పబ్లిక్ గ్రీవెన్స్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించి సమస్యల పరిష్కారం కోసం అప్పటికప్పుడే అధికారుల దృష్టికి తీసుకెళ్లి వెంటనే పరిష్కరించాలని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారం పట్ల ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ భైలడుగు బాలయ్య, మండల టీడీపీ అధ్యక్షుడు మార్తాల సుబ్బారెడ్డి, పట్టణశాఖ అధ్యక్షుడు సయ్యద్ షాన్షావలి, సొసైటీ బ్యాంక్ చైర్మన్ దుత్తా బాలీశ్వరయ్య, మున్సిపల్ కౌన్సిలర్లు లొక్కు రమేష్, బి.చంద్రశేఖర్‌యాదవ్ పాల్గొన్నారు.

స్మార్ట్ కార్డులను వినియోగంలోకి తెచ్చుకోవాలి

పెద్ద దోర్నాల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : నూతనంగా మంజూరయిన స్మార్ట్ రేషన్ కార్డులు పొందిన వారు యాక్టివేషన్ చేయించుకోవాలని డిప్యూటీ తహసీల్దారు మల్లికార్జున నాయుడు బుధవారం ప్రకటనలో తెలిపారు. స్మార్ట్ రేషన్ కార్డులు పొందిన వారు వీఆర్వోలు, సచివాలయం సిబ్బంది వద్ద వేలిముద్ర వేయడమో లేదా ఆధార్‌కార్డు నెంబరుతో ఓటీపీ, ముఖం ఫొటో తీయించుకోవాలని చెప్పారు.

ఉద్యోగోన్నతులపై జీవో విడుదల చేయాలి

మార్కాపురం వన్‌టౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ ఉద్యోగుల ఉద్యోగోన్నతులపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అనుమతులు ఇచ్చినా ఆర్టీసీ అధికారులు జీవో విడుదల చేయలేదని ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవీ నర్సయ్య అన్నారు. ఆర్టీసీ డిపో వద్ద నూతనంగా నిర్మించిన ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయాన్ని నర్సయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన స్త్రీ శక్తి పథకం అమలులో ఆర్టీసీ ఉద్యోగుల శ్రమను గుర్తించి అసెంబ్లీలో సీఎం అభినందించడం గర్వంగా ఉందన్నారు.3000 కొత్త బస్సులు, 10వేల ఉద్యోగ నియామకాలు జరగాలన్నారు. కార్యక్రమంలో ఎంఎన్ కుమార్, జీవీవీ వెంకటేశ్వర్లు, చక్రపాణి, ఎస్‌వీఎస్ శాస్త్రి పోలయ్య, శేఖర్ నాయుడు, బాషా హుస్సేన్, మంగమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.

పరీక్షల నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు

రాచర్ల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : పరీక్షల నిర్వహణలో ఉపాధ్యాయులు నిర్లక్ష్యం వహించవద్దని బంగారు బాల్యం జిల్లా నోడల్ అధికారి వీ గిరిధరశర్మ అన్నారు. ఆదర్శ జడ్పీ ఉన్నత పాఠశాలల్లో జరుగుతున్న ఎఫ్ఏ-2 పరీక్షలను బుధవా రం ఆయన పరిశీలించారు. విద్యార్థులను ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. ఉపాధ్యాయులు పరీక్షలు బాధ్యతగా నిర్వహించాలని విద్యార్థులు మంచి మార్కులు సాధించే విధంగా కృషిచేయాలన్నారు. అనంతరం జడ్పీ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులకు ఒడ్డించి తృప్తికరంగా ఉందన్నారు.

బీజేపీ రాష్ట్ర మీడియా సెల్ ప్రతినిధిగా డాక్టర్ ఏలూరి



మార్కాపురం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ బీజేపీ రాష్ట్ర మీడియా సెల్ ప్రతినిధిగా డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి నియమితులయ్యారు. రాష్ట్ర పార్టీ రాష్ట్ర మీడియా ప్యానలిస్టుల జాబితాను బుధవారం విడుదల చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 19 మందికి జాబితాలో చోటు దక్కింది. ప్రకాశం జిల్లా నుంచి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి ఈ జాబితాలో పేరు స్థానం పొందారు. తనకు మీడియా సెల్ ప్రతినిధిగా అవకాశం కల్పించిన రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌కు ధన్యవాదాలు తెలిపారు.

జీఎంఆర్ స్కూల్‌కు కలాం అవార్డ్


అవార్డును అందుకుంటున్న మల్లికార్జునరెడ్డి

మార్కాపురం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జీఎంఆర్ హైస్కూల్‌కు ప్రతిష్ఠాత్మక ఏపీజే అబ్దుల్ కలాం అవార్డ్ వరించింది. లీడ్ ఇండియా ఫౌండేషన్ సంస్థ దేశవ్యాప్తంగా అత్యుత్తమ విద్యనందిస్తూ, విద్యార్థుల సమగ్ర ప్రగతికి కృషి చేస్తున్న పాఠశాలలకు ప్రతి ఏటా కలాం జయంతి రోజున అవార్డులను అందజేస్తుంది. ఈక్రమంలో ఈ సంవత్సరం జీఎంఆర్ హైస్కూల్‌ను అవార్డుకు ఎంపిక చేసింది. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో బుధవారం హైస్కూల్ కరస్పాండెంట్ గొట్టం మల్లికార్జునరెడ్డికి సంస్థ ప్రతినిధులు అవార్డును అందించారు.

మహదేవయ్యను విధుల్లోకి తీసుకోవాలి

మార్కాపురం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): తపాలా ఉద్యోగుల హక్కుల కోసం పోరాడుతున్న ఆల్ ఇండియా గ్రామీణ డాక్ సేవక్ యూనియన్ ప్రధాన కార్యదర్శి మహదేవయ్యను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని మార్కాపురం నాయకులు రమణారెడ్డి డిమాండ్ చేశారు. పోస్టాఫీస్ వద్ద బుధవారం మహదేవయ్య తొలగింపును నిరసిస్తూ ఒక్క రోజు ధర్నా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రమణారెడ్డి మాట్లాడుతూ హక్కుల కోసం పోరాడితే విధుల నుంచి తొలగించడం అన్యాయమన్నారు. వెంటనే అతనిని విధుల్లోకి తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బ్రాంచి పోస్టమాస్టర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.


ధర్నాలో మాట్లాడుతున్న రమణారెడ్డి


మినుములను పంపిణీ చేస్తున్న శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు

జీవన ఎరువులు వాడాలి

దర్శి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు

పెద్దారవీడు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : రైతులు పంటల సాగులో రసాయనాలను వీడి, జీవన ఎరువులను వాడాలని దర్శి కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ రమేష్ పిలుపునిచ్చారు. మండలంలోని చట్లమిట్ట రైతు సేవా కేంద్రం పరిధిలో బుధవారం రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రమేష్ మాట్లాడుతూ రసాయనిక ఎరువులు ఎక్కువగా వాడితే నేల చౌడుబారుతుందన్నారు. దీంతో నేలలో మొక్కలకు మేలు చేసే సూక్ష్మజీవులు చనిపోతాయన్నారు. ప్రథమ శ్రేణి ప్రదర్శన క్షేత్రం కింద 30 మంది రైతులకు మినుము టీబీజీ 104 రకం విత్తనాలను అందజేశారు. కీటక శాస్త్రవేత్త వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ కందిలో వెర్రి తెగులు రాకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. మినుమును ముందుగా నాటిన రైతులు పల్లాకు తెగులు రాకుండా నివారించాలని సూచించారు. ఏడీఏ బాలాజీ నాయక్ మాట్లాడుతూ రైతులు తాము సాగు చేసిన పంటలను తప్పక నమోదు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏవో లక్ష్మీ నారాయణ, రైతు సేవా కేంద్రం సిబ్బంది రవి, మల్లూ నాయక్, రైతులు పాల్గొన్నారు.

వెదురు సాగుతో అధిక లాభాలు

రాచర్ల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : కష్టపడి సాగు చేస్తే వెదురు సాగుతో అధిక లాభాలు ఉన్నాయని ఎంపీడీవో ఎస్ వెంకట రామిరెడ్డి అన్నారు. సెర్ప్, ఇండస్ట్రీ వారు సంయుక్తంగా మంజూరు చేసిన వెదురు మొక్కలను బుధవారం ఆయన సన్న, చిన్నకారు రైతులకు ఎంపీడీవో కార్యాలయంలో పంపిణీ చేశారు. మొక్కలు నాటిన మూడు సంవత్సరాలకు పంట సాగులోకి వస్తుందని కాస్త ఓపికతో ఉంటే మంచి ఫలితాలు సాధించవచ్చని తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు వస్తాయన్నారు. మూడు సంవత్సరాల తర్వాత ఇండస్ట్రీ సిబ్బంది మార్కెటింగ్ సదుపాయం కూడా కల్పిస్తారని తెలిపారు. మండలంలో 161మంది రైతులకు 9,660 మొక్కలు మంజూరయ్యాయని ఒక్కొక్క రైతుకు 60 మొక్కలు ఇస్తున్నట్లు తెలిపారు. జాబ్ కార్డు ఉన్నవారే కాకుండా స్వచ్ఛందంగా రైతులు కావాలని అడిగినా వెదురు మొక్కలు అందివ్వడం జరుగుతుందని అన్నారు. అనంతరం ప్రపంచ చేతుల శుభ్రత దినోత్సవం సందర్భంగా నాయకులు సంబంధిత అధికారులతో కలిసి చేతుల శుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించి పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ షేక్ ఖాశింబి, ఇన్‌చార్జి ఈవోఆర్డీ అనిల్ కుమార్, ఎంఈవీ వీ గిరిధర శర్మ, ఉపాధి హామీ ఏపీవో ఆర్.మహాలక్ష్మి, వెలుగు ఏపీఎం కే నరేష్, మహిళా సమాఖ్య మండల సభ్యులు విజయలక్ష్మి, నిర్మల, నాయకులు కాశిరెడ్డి, కళ్యాణ్ రెడ్డి, శ్రీనివాసులు, సాయి పాల్గొన్నారు.

చెన్నకేశవులుకు ఘన సన్మానం

కంభం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : కంభంలో మాజీ సైనికులు ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి గోన చెన్నకేశవులును బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ సైనికుల సంఘం అధ్యక్షుడు షెట్లం వేణుగోపాల్ మాట్లాడుతూ కంభానికి చెందిన ఎస్సీ నాయకుడు గోన చెన్నకేశవులుకు ఏపీ విద్య, మౌలిక వసతుల కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమించినందుకు వారు రాష్ట్ర ప్రభుత్వానికి, అందుకు సహకరించిన ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. చెన్నకేశవులు ఈ ప్రాంతంలోని విద్యాలయాలను అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు జి అంకయ్య గౌడ్, కార్యదర్శి పుల్లయ్య, జాయింట్ సెక్రటరీ ప్రసాద్, పలువురు మాజీ సైనికులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

రాచర్ల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాచర్ల యడవల్లి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న గ్రామాలకు ఆర్‌డీ ఎస్ఎస్ పనుల కారణంగా నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ కే బాలగురవయ్య బుధవారం తెలిపారు. రాచర్ల పరిధిలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు యడవల్లి గ్రామ పరిధిలో మధ్యాహ్నం 3 నుంచి 6గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

చేతుల శుభ్రతతోనే ఆరోగ్యం


వై పాలెంలో చేతులు శుభ్రం చేసుకుంటున్న అధికారులు, సిబ్బంది

తర్లుపాడు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): చేతులు శుభ్రం చేసుకోవడం వలన ఆరోగ్యంగా ఉంటామని ఎంపీడీవో ఓ.అన్నమ్మ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో, లింగారెడ్డి కాలనీ ప్రాథమిక పాఠశాలలో గ్లోబల్ వాషింగ్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కార్యాలయం అధికారులు చేతులు శుభ్రం చేసుకున్నారు. అలాగే పాఠశాలలోని విద్యార్థులు, ఉపాధ్యాయులు చేతులు శుభ్రం చేసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయం సూపరింటెండెంట్ బుర్రి చంద్రశేఖర్, సీనియర్ అసిస్టెంట్ కోటిరెడ్డి, రమణారెడ్డి, ఏపీవో రవళి, హెచ్ఎం షేక్ మౌలాలి పాల్గొన్నారు.

కంభం : చేతుల పరిశుభ్రతతో ఆరోగ్య భద్రతను పొందవచ్చని ఎంపీడీవో వీరభద్రాచారి అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రపంచ చేతుల పరిశుభ్రత దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు చేతుల పరిశుభ్రతపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో ఎంఈవో-1 అబ్దుల్ సత్తార్, పీడీలు సుబ్రహ్మణ్యం, విజయ్ కుమార్, ఉపాధ్యాయులు రమణారెడ్డి, పాండురంగబాబు, మస్తాన్ వలి పాల్గొన్నారు.

ఎర్రగొండపాలెం రూరల్ : మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంటుందని ప్రతి ఒక్కరు చేతులను పరిశుభ్రంగా కడుక్కోవాలని ఎర్రగొండపాలెం పంచాయతీ కార్యదర్శి రామ సుబ్బయ్య అన్నారు. బుధవారం జాతీయ హ్యాండ్ వాష్ దినోత్సవం సందర్భంగా పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ, సచివాలయం సిబ్బందితో ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఏరియా ఆసుపత్రిలో క్యాన్సర్‌పై అవగాహన

ఎర్రగొండపాలెం రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ స్క్రీనింగ్ పద్ధతులపై ఎర్రగొండపాలెం ఏరియా వైద్యశాలలో సూపరింటెండెంట్ డాక్టర్ యాదిద్య దేవర ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. అమెరికన్ అంకాలజీ ఇన్‌స్టిట్యూట్ (ఏవోఐ) గుంటూరు సర్జికల్ అంకాలజిస్ట్ డాక్టర్ ఫణీందర్ కుమార్, రేడియో అంకాలిస్ట్ డాక్టర్ ప్రతాప్‌రెడ్డి సిబ్బందికి అవగాహన కల్పించారు. ఆ సందర్భంగా వారు మాట్లాడుతూ క్యాన్సర్ స్క్రీనింగ్ చేయించుకుని అర్హత కలిగిన రోగులకు ఎన్టీఆర్ వైద్య సేవ కింద ఉచిత సేవలు పొందవచ్చునన్నారు. పూర్తి వివరాల కోసం ఏరియా వైద్యశాలలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో వైద్యశాలలోని డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలకు ప్రింటర్ బహూకరణ

తర్లుపాడు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సూరేపల్లి ప్రాథమిక పాఠశాలకు ఉమారెడ్డిపల్లె గ్రామానికి చెందిన తాడి కాశిరెడ్డి ప్రింటర్‌ను బహుకరించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు షేక్ నజీర్ అహ్మద్ మాట్లాడుతూ.. పాఠశాలకు ప్రింటర్‌ను బహూకరించడం విద్యాభివృద్ధికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అనంతరం దాత కాశిరెడ్డిని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తాడి లక్ష్మీనారాయణ, పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ డి.శ్రీనివాసులు, జి.రమణయ్య, నాగతిరుపతయ్య పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న రీడింగ్ రూం కార్యదర్శి సుబ్బారెడ్డి

ఘనంగా మాగుంట జన్మదిన వేడుకలు

మార్కాపురం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి జన్మదిన వేడుకలను బుధవారం పట్టణంలోని ఎస్‌సీవీకే నిలయం (రీడింగ్ రూమ్)లో ఘనంగా నిర్వహించారు. ముందుగా కార్యదర్శి, ఏఎంసీ మాజీ చైర్మన్ గుంటక సుబ్బారెడ్డి కేక్ కట్‌చేసి సభ్యులకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా అభివృద్ధి కోసం నిరంతరం పాటుపడే గొప్ప వ్యక్తి శ్రీనివాసులరెడ్డి అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైరన్ షేక్ షెక్షావలి, మాజీ కౌన్సిలర్ మయూరి ఖాశిం, పఠాన్ హుసేన్‌ఖాన్, దారివేముల శరత్‌కుమార్, కాశిరెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

100 మందికి వైద్య పరీక్షలు

గిద్దలూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : గిద్దలూరులో పెద్దకాకాని శంకర నేత్ర వైద్యశాల ఆధ్వర్యంలో శంకర విజన్ సెంటర్ వారు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. సుమారు 100 మందిని పరీక్షించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ నలిని, అర్బన్ హెల్త్‌సెంటర్ వైద్యాధికారి డాక్టర్ సూర్యచంద్ర, మానవత సేవా సంస్థ చైర్మన్ పాలుగుళ్ళ శివారెడ్డి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శంకర నేత్ర వైద్యశాల యూనిట్ హెడ్ మాధవి, మేనేజర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ కంటి సుక్లాల ఆపరేషన్లు అవసరమైన వారికి ప్రత్యేక బస్సులో పెద్దకాకానికి తీసుకుని వెళ్లి ఆపరేషన్ అనంతరం తిరిగి గిద్దలూరులో విడచడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

అబ్దుల్ కలాంకు నివాళి


నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

మార్కాపురం వన్‌టౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): భారత అణుశాస్త్ర పితామహుడు, మిస్సైల్ మేన్ డా. ఏపీజే అబ్దుల్ కలాంను విద్యార్థులు ఆదర్శంగా తీసుకుని ఎదగాలని వాసవీ విద్యానికేతన్ ప్రిన్సిపాల్ కందెపు రంగయ్య అన్నారు. ఏపీజే అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా కలాం చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రంగయ్య మాట్లాడుతూ.. కలాం దేశానికి ఎన్నో సేవలు అందించారన్నారు. బాలుర ఉన్నత పాఠశాలలో బీజేపీ ఆధ్వర్యంలో అబ్దుల్ కలాం జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు షబానా, కృష్ణారావు పేరెంట్స్ లేని ఇద్దరు పిల్లలను దత్తత తీసుకున్నారు. ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

గిద్దలూరు : మాజీ రాష్ట్రపతి, భారతరత్న అవార్డ్ గ్రహీత డాక్టర్ అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా ముస్లింలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని కలాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ముస్లిం మైనారిటీ అభివృద్ధి సంఘం అధ్యక్షుడు గుడిసె మహబూబ్‌బాషా, వివిధ మసీదుల ప్రతినిధులు, ముస్లిం మైనారిటీ అభివృద్ధి సంఘం ప్రతినిధులు లియాకత్‌అలీ, అబ్దుల్‌హక్, అబ్దుల్‌రషీద్, ఉస్మాన్, చాంద్‌బాషా, అలీబాబా, నాయబ్‌రసూల్ పాల్గొన్నారు.

పట్టణంలోని గిరిజన గురుకుల బాలుర పాఠశాలకు చెందిన విద్యార్థులకు అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా పరీక్ష అట్టలు, పెన్నులు, ఇతర సామగ్రిని యువ ప్రగతి పథం సంస్థ అధ్యక్షుడు అందచేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు పి.వేణుగోపాల్, సంస్థ ప్రతినిధులు రత్నం, సిద్ధయ్య, వేణుగోపాల్‌తో పాటు గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వరనాయక్ పాల్గొన్నారు.

రైతు వెంకటేశ్వర్లు ఆత్మహత్యపై విచారణ

ముండ్లమూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నూజెండ్లపల్లి గ్రామానికి చెందిన వెంగళశెట్టి వెంకటేశ్వర్లు అప్పుల బాధ తాళలేక పురుగుల మందు తాగి మృతి చెందిన సంఘటనపై తహసీల్దార్, వ్యవసాయ శాఖ అధికారి తిరుమలరావు, పోలీసులు బుధవారం విచారణ చేపట్టారు. మృతుడికి అప్పు ఎంత, గతంలో కౌలు భూములు ఎన్ని ఎకరాలు తీసుకొని సాగు చేశాడు, ఎంత మేరకు నష్టాలు వచ్చాయనే దానిపై కూడా విచారణ చేపట్టారు. ప్రభుత్వం నుంచి సాయాన్ని అందించేందుకు కృషి చేస్తామని తహసీల్దార్ చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ పవన్ కుమార్, వీఆర్వో సుజాత పాల్గొన్నారు.

ప్రధాని మోదీ మౌనం వ్యవసాయ రంగానికి నష్టం

దొనకొండ, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన వాణిజ్య యుద్ధం వలన ప్రధాని మోదీ మౌనం భారత వ్యవసాయ రంగాన్ని, పారిశ్రామిక రంగాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెడుతోందని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కంకణాల ఆంజనేయులు చెప్పారు. ట్రంప్ ప్రభుత్వం విధించిన టారిఫ్ టెర్రరిజంకు వ్యతిరేకంగా బుధవారం దొనకొండలోని పలు ప్రాంతాల్లో కరపత్రాలు పంచి అమెరికా వాణిజ్య సుంకాల వలన దేశానికి జరిగే నష్టాన్ని ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిరుపల్లి అంజయ్య, కుందుర్తి చిన్నానర్సింహులు, కర్నా కృష్ణా, కురవటి రామయ్య, కొండా ఫ్రాన్సిస్, కె ఏసుదాసు, మేళం ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

పామూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాలకులు మారినా సంక్షేమ హాస్టల్స్‌లోని సమస్యలు పరిష్కరం కావడంలేదని సీపీఎం జిల్లా కార్యవర్గసభ్యుడు సయ్యద్ హనీఫ్ ఆరోపించారు. పట్టణంలోని ఎస్సీ, బీసీ సంక్షేమ హాస్టళ్లను సీపీఎం బృంద సభ్యులు బుధవారం పరిశీలించారు. పేద, దళిత వెనుకబడిన తరగతుల విద్యార్థులు సమస్యల వలయంలో చదువులను నెట్టుకొస్తున్నారని, ప్రభుత్వాలు తగిన సౌకర్యాలు, ఖాళీ పోస్టులు భర్తీ చేయడంలో వైఫల్యం చెందాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కె మాల్యాద్రి, గౌస్‌బాషా, శంకర్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ దాడులు

ముండ్లమూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వేముల, కమ్మవారిపాలేల్లో బుధవారం విజిలెన్స్ ఎన్‌ఫోర్స్ బృందం సీఐ రవిబాబు ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. వేముల గ్రామంలో లక్ష్మీప్రసన్న ఆగ్రో ట్రేడర్స్, శ్రీ వెంకటేశ్వర ట్రేడర్స్, శ్రీ వెంకటేశ్వర ఏజెన్సీ, కమ్మవారిపాలెంలో శ్రీ శ్రీనివాస ట్రేడర్స్ ఎరువుల దుకాణంలో తనిఖీలు నిర్వహించారు. యూరియా బస్తాలు 15 అదనంగా ఉండటంతో కేసు నమోదు చేశారు. ఈ దాడుల్లో ఏవో తిరుమలరావు, హెడ్ కానిస్టేబుల్ రవికుమార్, కానిస్టేబుల్ తిప్పస్వామి పాల్గొన్నారు.

కొత్త టీచర్లకు ఏపీటీఎఫ్ నాయకుల శుభాకాంక్షలు

పామూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : మెగా డీఎస్సీ ద్వారా ఎంపికై పామూరు మండలంలో చేరిన నూతన ఉపాధ్యాయులకు ఏపీటీఎఫ్ పామూరు మండల శాఖ తరఫున బుధవారం శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా కార్యదర్శి షేక్ నాయబ్‌రసూల్ ఆధ్వర్యంలో పడమటకట్టకిందపల్లి, వీరభద్రాపురం, చిలంకూరు, వగ్గంపల్లి, మార్కొండాపురం, నర్రమారెళ్ల, మోపాడు, పామూరు హైస్కూల్‌లో టీచర్లను కలిసి పరిచయాలు చేసుకొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఎం శ్రీనివాసులు, షేక్ ఖాజామస్తాన్, మచ్చా ప్రసాద్, ఎం మాల్యాద్రి పాల్గొన్నారు.

మత్స్య మర్మం..!

సొసైటీల మాటున చేపల పెంపకం పేరుతో ఓ వ్యాపారి దోపిడీ

దర్శి నియోజకవర్గంలోని నాలుగు చెరువుల్లో ఇదే తంతు.. సహకరిస్తున్న అధికారులు

దర్శి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి) : సొసైటీల మాటున చేపల వ్యాపారి దోపిడీ చేస్తున్నారు. మత్స్యకారుల జీవనోపాధి కోసం ప్రభుత్వం నామమాత్రం రుసుంతో చేపలు పెంచుకునేందుకు కల్పించిన అవకాశాలను సొమ్ము చేసుకుంటున్నారు. అధికారులను లోబర్చుకొని, మత్స్యకారులను మాయచేసి సొసైటీ చెరువుల్లో వ్యాపారి ఏళ్ల తరబడి పాగా వేశారు. వాటిల్లో చేపలు పెంచుకుంటూ కోట్లాది రూపాయలు గడిస్తున్నారు. ఇంత జరుగుతున్నా పాలకులు చోద్యం చూస్తుండడం విమర్శలకు తావిస్తోంది. వివరాల్లోకెళ్తే...


పొతకమూరు చెరువులో చేపలు పెంచుతూ పాతిన కర్రలు

మత్స్యకారులకు దక్కని ప్రభుత్వ ఫలాలు

దర్శి మండలంలోని పొతకమూరు, తూర్పువీరాయపాలెం, ముండ్లమూరు మండలంలోని పులిపాడు, ఉల్లగల్లు చెరువులు మత్స్యకారుల సొసైటీ పరిధిలో ఉన్నాయి. ఒక్కొక్క చెరువు సుమారు 400 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ప్రభుత్వమే చేపల పెంపకానికి వేలం పాటలు నిర్వహిస్తే ఒక్కొక్క చెరువు కోటి రూపాయల వరకు పాటపలికే అవకాశముంది. కేవలం మత్స్యకారుల జీవనోపాధి కోసం ఎంతో ఆదాయం వచ్చే చెరువులను సొసైటీలకు కేటాయించారు. ప్రభుత్వం సదుద్దేశ్యంతో తీసుకున్న నిర్ణయం తాలూకు ప్రతిఫలం మత్స్యకారులకు అందటం లేదు. పేదలైన మత్స్యకారులు ఒత్తిళ్లకు తలొగ్గి బడా వ్యాపారి చెప్పినట్లు సంతకాలు చేస్తున్నారు. సొసైటీ సభ్యులకు అంతో ఇంతో ఇచ్చి చేపలు పెంచుకుంటూ అతను లబ్ధిపొందుతున్నారు.

పదేళ్ల నుంచి అతనే...

నర్సరావుపేటకు చెందిన ఒక వ్యాపారి సుమారు పదేళ్లుగా సొసైటీల చెరువుల్లో చేపలు పెంచుకుంటూ వ్యాపారం చేసుకుంటున్నారు. ఏళ్ల తరబడి ఈ తంతు కొనసాగుతున్నప్పటికీ మత్స్యశాఖ అధికారులు ముడుపులు తీసుకుంటూ వారికి కొమ్ముకాస్తున్నారు. దీంతో మత్స్యకారులకు తీరని అన్యాయం జరుగుతోంది. వైసీపీ ప్రభుత్వం హయాంలోనూ అతను ఇష్టానుసారంగా వ్యవహరించారు. ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా ఈ తంతు కొనసాగుతోంది. ఆయా గ్రామాల ప్రజలు కూడా మత్స్యకారుల పేరున వ్యాపారి సొమ్ము చేసుకుంటున్న విషయాన్ని సహించలేకపోతున్నారు. కనీసం పంచాయతీలకు అప్పగిస్తే గ్రామాలైనా అభివృద్ధి చెందుతాయనే అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు వాస్తవ పరిస్థితులను గుర్తించి నిజమైన మత్స్యకారులు చేపలు పెంచుకునేలా చర్యలు తీసుకోవాలని లేదా ఆ చెరువులను పంచాయతీలకు విలీనం చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

బయోగ్యాస్ ప్లాంట్‌కు కేటాయించిన భూముల పరిశీలన

చింతగంపల్లిలో ఆర్డీవో పర్యటన

పీసీపల్లి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దివాకరపల్లి సమీపంలో రిలయన్స్ కంప్రైస్డ్ బయోగ్యాస్ ప్లాంట్‌కు అవసరమైన భూములను కనిగిరి ఆర్డీవో జీ కేశవర్దన్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. బయోగ్యాస్‌గా అవసరమైన గడ్డిని పెంచేందుకు భూములు అవసరం రావటంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తహసీల్దార్ సీహెచ్ ఉషా చింతగంపల్లి, నేరేడుపల్లి, గుంటుపల్లి, పెద వీర్లపాడు రెవెన్యూ పరిధిలో 1611.24 ఎకరాల ప్రభుత్వ భూములను గుర్తించారు. ఆ భూములకు సంబంధించిన వివరాలను ఉన్నతాధికారులకు నివేదించారు. తహసీల్దార్ గుర్తించిన భూములను పరిశీలించేందుకు ఆర్డీవో చింతగంపల్లిలో పర్యటించారు. ఈ సందర్భంగా అక్కడ రెవెన్యూ అధికారులు గుర్తించిన భూములను పరిశీలించిన ఆయన భూమి స్వభావాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో రఫీ పాల్గొన్నారు.

రికార్డులను తనిఖీ చేసిన ఆర్డీవో

కనిగిరి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : సాధారణ పరిశీలనలో భాగంగానే రికార్డులను తనిఖీ చేస్తున్నట్లు ఒంగోలు ఆర్డీవో కళావతి చెప్పారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఆమె మూడు నెలలకు సంబంధించిన మ్యుటేషన్ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ రెవెన్యూ శాఖలో ఆరునెలలకోమారు రికార్డులను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్లు చెప్పారు. అందులో భాగంగా కనిగిరి మండలంలో మూడు నెలలుగా చేపట్టిన మ్యుటేషన్ ఆన్‌లైన్ వాటి ఫైళ్లను పరిశీలించామన్నారు. అదేవిధంగా ఈ ప్రక్రియ గురువారం కూడా కొనసాగించనున్నట్లు చెప్పారు. పరిశీలించిన రికార్డులలో ఏదైనా లోపాలు జరిగితే వాటిని సవరిస్తామన్నారు. అక్రమంగా మ్యుటేషన్‌లపై నివేదిక కలెక్టర్‌కు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వెలిగండ్ల తహసీల్దార్ ఎన్ వాసు పాల్గొన్నారు.


మ్యుటేషన్ రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీవో కళావతి

ఉజ్వల భవిష్యత్తుకు విద్యార్థులు బాటలు వేసుకోవాలి

జీసీడీవో హేమలత

కనిగిరి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు లక్ష్యసాధనలో ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సమగ్రశిక్ష జీసీడీవో హేమలత చెప్పారు. స్థానిక ప్రభుత్వ బాలికల హైస్కూల్‌ను బుధవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ఒకేషనల్ విద్య కోసం కోట్లాది రూపాయలు వెచ్చించి అధునాతన మెటీరియల్ సరఫరా చేస్తోందన్నారు. అదేవిధంగా నిష్ణాతులైన బోధకులను నియమించినట్లు చెప్పారు. హైస్కూల్‌లో రూ.10లక్షలతో సరఫరా చేసిన కంప్యూటర్ సామగ్రి, బ్యూటీషియన్ కోర్సు శిక్షణ సామగ్రిని ఆమె పరిశీలించారు. ఎంఈవోలు యూవీ నారాయణరెడ్డి, రాజాల కొండారెడ్డి, హెచ్‌ఎం విజయలక్ష్మి, జిల్లా ఒకేషనల్ కో ఆర్డినేటర్లు పాల్గొన్నారు. అనంతరం పట్టణ సమీపంలోని గార్లపేట రోడ్డులో ఉన్న మోడల్‌స్కూల్‌ను జీసీడీవో తనిఖీ చేశారు. మెనూ, భోజనవసతి సదుపాయాలు, తాగునీరు వంటి అంశాలను పరిశీలించారు. ప్రహరీ నిర్మాణ పనులను పరిశీలించారు. తనిఖీ సమయంలో ఎంఈవోలు రాజాల కొండారెడ్డి, ప్రిన్సిపల్ పద్మావతి, ఎస్‌ఎంసీ చైర్మన్ మోహన్, అధ్యాపకులు పాల్గొన్నారు.


వంటసామగ్రి గురించి సిబ్బందిని అడిగి తెలుసుకుంటున్న జీసీడీవో హేమలత

వ్యక్తిగత పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి

కనిగిరి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : వ్యక్తిగత పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి చెప్పారు. స్థానిక మోడల్‌స్కూల్‌లో గ్లోబల్ వాషింగ్ డే సందర్భంగా బుధవారం విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులచే హ్యాండ్ వాష్ చేయించారు. ప్రతి విద్యార్థి భోజనానికి ముందు తప్పనిసరిగా చేతులను పరిశుభ్రంగా కడగాలన్నారు. అంటువ్యాధులు, అనారోగ్యాలు దరిచేరవని చెప్పారు. అదేవిధంగా ప్లాస్టిక్ వాడక నియంత్రణకు కృషి చేయాలన్నారు. అనంతరం హ్యాండ్ వాష్‌పై చేపట్టే 7రకాల పద్ధతులను వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ పద్మావతి, ఇంటర్నేషనల్ మాస్టర్ అథ్లెట్ సిల్వర్ మెడల్ గ్రహీత డోలా శ్యామల, డేటాల్ బనేగా స్వస్థ ఇండియా స్టేట్ ప్రాజెక్టు మేనేజర్ ప్రహశిత్, లక్ష్మీ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాయబ్‌రసూల్ పాల్గొన్నారు.



హ్యాండ్ వాషింగ్‌పై అవగాహన కల్పిస్తున్న కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి

ఘనంగా కలాం జయంతి వేడుకలు

పామూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : మిస్సైల్ సృష్టికర్త, దేశ 11వ మాజీ రాష్ట్రపతి డాక్టర్ అబ్దుల్‌కలాం జయంతి కార్యక్రమాన్ని ముస్లిం సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ హాజీ గౌస్, ముబినామౌలాలి, కోడిగుంపల నాయబ్‌రసూల్, షేక్ ఖాజారహంతుల్లా, పులి నాయబ, పత్తు మస్తాన్ పాల్గొన్నారు.


కలాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సభ్యులు

మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కలాం చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు గంగాధర్‌రెడ్డి, అనంత నాగలక్ష్మి, ఎన్ జనార్దనరావు పాల్గొన్నారు. అదేవిధంగా వైసీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో నేతలు రామిరెడ్డి, షేక్ చాంద్‌బాషా, భాస్కరరెడ్డి, నాయబ్‌రసూల్, జే గోవిందయ్య, షేక్ గయాజ్ పాల్గొన్నారు.

కనిగిరిలో...

కనిగిరి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : స్థానిక మున్సిపల్ కార్యాలయంలో జరిగిన కలాం జయంతి వేడుకల్లో మున్సిపల్ చైర్మన్ గఫార్, కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి, మున్సిపల్ మేనేజర్ ప్రసాద్, టీపీవో సువర్ణకుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాయబ్‌రసూల్, హెల్త్ సెక్రటరీ చెన్నకేశవులు పాల్గొన్నారు.

చెకుముకి సైన్స్ సంబరాలను విజయవంతం చేయాలి

పామూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచన విధానాన్ని పెంపొందించడానికి చెకుముకి సైన్స్ సంబరాలు ఎంతగానో ఉపయోగపడతాయని ఎంఈవో కోటిరెడ్డి చెప్పారు. ఈ నెల 18న పాఠశాల, నవంబరు 1న మండల, 23న జిల్లా, డిసెంబరు 12, 13 తేదీల్లో రాష్ట్ర స్థాయిలో సంబరాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు నరేంద్ర, నాగిరెడ్డి, శంకర్, వేణుగోపాల్, బసవయ్య పాల్గొన్నారు.


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎంఈవో కోటిరెడ్డి

పామూరు టీడీపీ కార్యదర్శిగా 'కటకం'

పామూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : పామూరు టీడీపీ కమిటీ కార్యదర్శిగా నియమితులైన కటకం శివప్రసాద్‌ను స్థానిక సింగిల్‌విండో కార్యాలయంలో బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సింగిల్ విండో అధ్యక్షుడు హరిబాబు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నీటి సంఘం చైర్మన్ పాలపర్తి రమణయ్య, ఎన్ సాంబయ్య, రవికుమార్, కొండా నరసింహులు, తిరుపతయ్య, ఎం నరసింహారావు, ఈ సత్యం పాల్గొన్నారు.


శివను సన్మానిస్తున్న టీడీపీ శ్రేణులు

అవీఇవీ

విశాఖకు గూగుల్ రాకతో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి

ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి


ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

కనిగిరి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : గూగుల్ రాకతో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. యువతకు ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్ అహర్నిశలు శ్రమించి ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధిగాంచిన కంపెనీలను రాష్ట్రానికి తీసుకువస్తున్నారని తెలిపారు. 12నెలల పాటు ఎంతో దృష్టి సారించి, నేషనల్ పాలసీ విధానాల్లో మార్పులు చేయించి, దాదాపు 2లక్షల మంది యువతీ, యువకులకు ఉపాధి కల్పించే గూగుల్ సంస్థను తీసుకురావటంలో మంత్రి లోకేష్ కృషి అభినందనీయమని వివరించారు. అప్పట్లో హైదరాబాద్‌లో సీఎం చంద్రబాబు కృషితో మైక్రోసాఫ్ట్ సంస్థ రావటంలో ఏ విధంగా అభివృద్ధి చెందిందో ప్రస్తుతం గూగుల్ సంస్థ విశాఖకు రావటం రాష్ట్రం అభివృద్ధికి బాటలు పడుతున్నాయని తెలిపారు. అమెరికా తర్వాత అతిపెద్ద సంస్థ విశాఖలో ఏర్పాటు కాబోతుందని సంతోషం వ్యక్తం చేశారు. దేశం మొత్తం గర్వించే సంస్థ రాష్ట్రానికి వచ్చినందుకు దేశవ్యాప్తంగా అందరూ ప్రశంసిస్తుంటే వైసీపీ నేతలు స్వాగతించకుండా తప్పుడు ప్రచారం చేయటం సిగ్గుచేటు అని తెలిపారు.

సచివాలయాలను శుభ్రతగా ఉంచాలి


మాట్లాడుతున్న ఎంపీడీవో అజిత

తాళ్లూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : గ్రామ సచివాలయాలను పరిశుభ్రంగా ఉంచాలని ఎంపీడీవో పి.అజిత చెప్పారు. మండలంలోని వితలాపురం సచివాలయాన్ని ఎంపీడీవో బుధవారం సందర్శించారు. ఆవరణ, సచివాలయంలోని గదులు అపరిశుభ్రంగా ఉండటంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ వారం రోజుల్లో పంచాయతీ కార్మికులను నియమించి సచివాలయాన్ని పరిశుభ్రం చేయాలన్నారు. సిబ్బంది హాజరు వివరాలను పరిశీలించారు. ఉదయం 10గంటలలోపు, సాయంత్రం 5తరువాత ముఖ హాజరు వేయలాన్నారు. రమణాలపాలెం వద్ద గల చెత్తసంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి షేక్ షహనాజ్‌బేగం, వీఆర్వో రమణారెడ్డి పాల్గొన్నారు.

పంట నమోదును పరిశీలించిన వ్యవసాయాధికారి


పంటల నమోదును పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు

దర్శి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పుచౌటపాలెం, కొత్తరెడ్డి పాలేల్లో జిల్యా వ్యవసాయాధికారి ఎస్ శ్రీనివాసరావు బుధవారం పంట నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో సాగుచేసిన పంటలను ప్రత్యక్షంగా పరిశీలించి సిబ్బంది రికార్డుల్లో ఏ పంటను నమోదు చేశారనే విషయాన్ని సూపర్ చెక్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పొలాల్లో ఏ పంట సాగు చేశారో ఈ క్రాప్ అదేవిధంగా నమోదు చేయాలని ఎవరైనా అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దర్శి ఏవో కె. రాధ, టెక్నికల్ ఏవో టి. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మాగుంటకు 'తాళ్లూరు' టీడీపీ నేతలు శుభాకాంక్షలు


మాగుంటకు శుభాకాంక్షలు తెలుపుతున్న తాళ్లూరు టీడీపీ నేతలు

తాళ్లూరు,అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి జన్మదినం సందర్భంగా ఒంగోలులోని ఆయన నివాసానికి మండల టీడీపీ నేతలు బుధవారం అధిక సంఖ్యలో తరలివెళ్లారు. మాగుంటను మండల టీడీపీ అధ్యక్షుడు మేడగం వెంకటేశ్వరరెడ్డి, రాష్ట్ర నాటక అకాడమీ కార్పొరేషన్ డైరెక్టర్ ఓబుల్‌రెడ్డి, ఒంగోలు పార్లమెంట్ టీడీపీ కార్యనిర్వహక కార్యదర్శి మానం రమేష్‌బాబు, రాష్ట్ర టీడీపీ మైనార్టీ సెల్ కార్యదర్శి షేక్ కాలేషావలి, రాష్ట్ర తెలుగుయువత కార్యదర్శి గొలపూడి వేణుబాబు, మన్నేపల్లి సొసైటీ అధ్యక్షుడు గొంది రమణారెడ్డి, నేతలు రాచకొండ వెంకట్రావు, పిన్నిక రమేష్, ఎన్ విద్యాసాగర్, కైపు రామకోటిరెడ్డి, తిరుపతిరెడ్డి, సుధాకర్, లక్ష్మీనారాయణ, నారిపెద్ది కళ్యాణ్ చక్రవర్తిలు గజమాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. నేతలు ఐవీ రమణారెడ్డి, ఐ.శ్రీనివాసరెడ్డి, కోనేటి వెంకట్రావు, పి.రమణారెడ్డి, ఏ సుబ్బారావు, పేరిరెడ్డి, ఆవుల ఆదినారాయణ, ప్రభాకర్‌రెడ్డి, నాదెండ్ల శ్రీను, దాసు పాల్గొన్నారు.

అర్హులందరికీ రేషన్ కార్డులు మంజూరు



స్మార్ట్ కార్డులను పంపిణీ చేస్తున్న బోయిళ్ల

సీఎస్‌పురం(పామూరు) అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : అర్హులైన లబ్ధిదారులందరికీ రాష్ట్రప్రభుత్వం క్యూఆర్ కోడ్‌తో తయారు చేసిన స్మార్ట్ రేషన్ కార్డులను మంజూరు చేసిందని సింగిల్ విండో మాజీ చైర్మన్ బోయిళ్ల నారాయణరెడ్డి చెప్పారు. మండలంలోని గుంతచెన్నంపల్లిలో స్మార్ట్ రేషన్ కార్డులను బుధవారం కార్డుదారులకు పంపిణీ చేశారు. పామూరు, ఇనిమెర్ల గ్రామాల్లో జరిగిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షుడు ఉప్పలపాటి హరిబాబు, ఇనిమెర్ల సర్పంచ్ సిద్ధమూర్తి లక్ష్మీనారాయణరెడ్డి పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేష్ఠం

పామూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : కిశోర బాలికల దశ నుంచే మంచి పోషకాహారం తీసుకోవడం వలన రక్తహీనత నివారించుకోవచ్చునని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ గోళ్ల పద్మజ చెప్పారు. మండలంలోని బొట్లగూడూరు సెక్టారులోని అక్కంపేట అంగన్‌వాడీ కేంద్రంలో 8వ రాష్ట్రీయ పోషణ మాసోత్సవాలు బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్యకర్త కవిత, ఆదిలక్ష్మి, దొరసానమ్మ పాల్గొన్నారు.







ప్లాస్టిక్ ప్రతి మనిషి జీవితంలో ఒక భాగమైంది. ఉదయం నిద్ర లేవగానే పాల ప్యాకెట్లతో మొదలయ్యే ప్లాస్టిక్ వినియోగం కూరలు, పళ్లు, టిఫిన్ ఇతర వస్తువులు ఏవి కొన్నా ప్లాస్టిక్ కవర్లనే ప్రజలు వినియోగిస్తున్నారు. ఒకసారి వాడిపడేసే ప్లాస్టిక్‌తో పర్యావరణంతో పాటు ఆరోగ్యానికి హానికరం అని తెలిసినా దానికి దూరంగా ఉండలేకపోతున్నారు. ప్లాస్టిక్‌ను తయారు చేసే, వినియోగించే వారిపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు చూసీ చూడకుండా వ్యవహరిస్తుండటంతో జిల్లాలో ప్లాస్టిక్ వాడకం యథేచ్ఛగా జరుగుతోంది.

నిషేధమా అదెక్కడ?

- జిల్లాలో ఎక్కడా అమలు కాని ప్లాస్టిక్ నిషేధం
- విచ్చలవిడిగా నిషేధిత ప్లాస్టిక్ సామగ్రి విక్రయాలు
- తనిఖీలు మరచిన అధికారులు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

స్వర్ణాంధ్ర.. స్వచ్ఛాంధ్ర లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోంది. ప్లాస్టిక్‌ను నిరోధించాలని అధికారులను ఆదేశిస్తోంది. డిసెంబరు నాటికి ప్లాస్టిక్ రహిత ఆంధ్రప్రదేశ్ రూపొందించాలని ప్రభుత్వం సంకల్పించింది. దీని కోసం పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేస్తోంది. అయితే ప్రభుత్వ లక్ష్యాలకు, ప్రజలు సంబంధిత అధికారులు తూట్లు పొడిచేలా వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి. జిల్లాలోని పట్టణాలతో పాటు పల్లెల్లోనూ విచ్చలవిడిగా ప్లాస్టిక్ వినియోగం జరుగుతోంది. ఉదయం పాల ప్యాకెట్ నుంచి ప్లాస్టిక్ వినియోగం ప్రారంభమవుతోంది. ప్రజలు నిషేధిత ప్లాస్టిక్ కవర్లను నిత్యం వేల సంఖ్యలో వినియోగిస్తున్నారు. వ్యాపారులు యథేచ్ఛగా నిషేధిత ప్లాస్టిక్ కవర్లను విక్రయిస్తున్నారు. కూరగాయలు, సరుకులు, పళ్లు ఇలా ఏమి కొనుగోలు చేసినా ప్లాస్టిక్ సంచుల్లోనే ఇస్తున్నారు.

● తనిఖీలను మరిచిన అధికారులు

ప్లాస్టిక్ వినియోగంపై మునిసిపాలిటీలు, పంచాయతీలు, సచివాలయాల పర్యవేక్షణ పూర్తిగా కొరవడింది. మునిసిపల్ అధికారులయితే తనిఖీలను పూర్తిగా మరిచారు. తిరిగి వాడుకునేందుకు పనికిరాని.. ఒకసారి వాడి పడేసే ప్లాస్టిక్‌తో తయారు చేసిన పాలథిన్ కవర్లు, సీసాలు, గ్లాసులు ఇలా 18 రకాల ప్లాస్టిక్ వస్తువులపై కేంద్రప్రభుత్వం నిషేధం విధించింది. నిషేధిత ప్లాస్టిక్ జాబితాలో 75 మైక్రాన్ల లోపు మందం ఉన్న క్యారీ బ్యాగులతో పాటు 50 మైక్రాన్లలోపు మందం ఉన్న ప్లాస్టిక్ షీట్లు, పాన్ మసాలా ప్యాకెట్లతో పాటు మరో 18 రకాల ప్లాస్టిక్ ఉత్పత్తులను చేర్చారు. ఒక్కసారి మాత్రమే వినియోగించే ప్లాస్టిక్ గ్లాసులు, కప్పులు, స్పూన్లు, స్ట్రాలు తదితరాలన్నీ నిషేధిత జాబితాలో ఉన్నాయి. నిషేధాన్ని క్షేత్రస్థాయిలో అధికార యంత్రాంగం అమలు చేయాల్సి ఉంది. అయితే జిల్లా వ్యాప్తంగా నిషేధిత ప్లాస్టిక్ ఉత్పత్తులను అరికట్టడంతో యంత్రాంగం (మిగతా 8వ పేజీలో)


ప్లాస్టిక్ కవర్లలో కూరల ప్యాకింగ్

● కఠినమైన చట్టాలున్నా అమలేది..!

కఠినమైన చట్టాలు ఉన్నా వీటిని అమలు చేసి నిషేధిత ప్లాస్టిక్‌ను అరికట్టాల్సిన అధికార యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తోంది. ప్లాస్టిక్ నిషేధిత చట్టాలను అమలు చేయటంలో అధికారులు వెనకడుగు వేస్తుండటం సర్వత్రా విమర్శలకు దారి తీస్తోంది. అధికారులు చర్యలు తీసుకోవటం మాట ఎలా ఉన్నా ఎవరికి వారు ప్లాస్టిక్ వినియోగంపై స్వీయ నియంత్రణ అవసరం. ప్రజా చైతన్యంతోనే ప్లాస్టిక్ వినియోగాన్ని అరికట్టే అవకాశం ఉంటుంది. ఒక వైపు చట్టాలను అమలు చేస్తూ మరో వైపు ప్రజలను చైతన్య పరిస్తే ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించే అవకాశం ఉంటుంది.

సీమౌత్‌ను రాళ్లతో పూడ్చివేసిన తీర ప్రాంత భూమి



ఎవరినడిగి.. సీమౌత్ పూడ్చారు..

"తీర ప్రాంతం విషయంలో కొన్ని నిబంధనలు ఉంటాయి. అందునా విశాల ప్రయోజనాలు ఇమిడి ఉన్న వాటిలో ముందస్తు అనుమతులు తప్పనిసరి. ఎవరి అనుమతులతో మీరు సీమౌత్‌ను రాళ్లతో పూడ్చివేశారు" డ్రైనేజీ, మత్స్య కార విభాగాలతో పాటు రెవెన్యూ యంత్రాంగం రియల్టర్ బుర్ల వెంకట్రావు కు సంధించిన సూటి ప్రశ్నలివి. ఈపూరుపాలెం సీమౌత్ పూడ్చివేత విషయంలో వెంకట్రావు తీరును తప్పుబడుతూ గంగ పుత్రులు గడచిన మూడు నెలలుగా వివిధ రూపాలలో ఆందోళన చేస్తున్న సంగతి తెలిసిందే. అత్యంత సున్నిత మైన ఈ అంశంపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని కలెక్టర్ వినోద్‌కుమార్ కమిటీని నియమించిన సంగతి కూడా తెలిసిందే. దీనిలో భాగంగా కాలువ పూడ్చివేతపై వివరణ ఇవ్వాల్సిందిగా రియల్టర్ వెంకట్రావుకు సదరు విభాగాలు సంయుక్తంగా నోటీసులు జారీ చేశాయి.

- రియల్టర్ వెంకట్రావుకు నోటీసులు జారీ
- స్టేట్‌మెంట్ రికార్డు చేసిన రెవెన్యూ యంత్రాంగం
- కాలువలో వేసిన రాళ్లను తొలగించాలని ఆదేశం
- కోర్టును ఆశ్రయించిన రియల్టర్..
- కమిటీ నివేదిక రేపు కలెక్టర్ చేతికి!

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

వారం రోజుల క్రితం రియల్టర్ బుర్ల వెంకట్రావు రెవెన్యూ విభాగం ముందు హాజరు కాగా అతని స్టేట్ మెంట్‌ను అధికారులు రికార్డు చేశారు. ప్రాథమిక చర్య లలో భాగంగా కాలువలో వేసిన రాళ్లను తొలగించాలని, లేదా అందుకు అయ్యే ఖర్చులు భరించాలని అధికారులు బుర్లను ఆదేశించినట్లు సమాచారం. ఈ అదేశాలిచ్చి కూడా వారం రోజులు దాటుతోంది. రాళ్లను తొలగించే కార్యక్రమం చేపట్టకపోగా రెవెన్యూ విభాగం ఇచ్చిన ఆదేశాలపై స్టే విధించాలని బుర్ల వెంకట్రావు హైకోర్టు మెట్లెక్కారు. పూర్తి వివరాలతో రెవెన్యూ విభాగం కోర్టుకు నివేదిక ఇచ్చినట్లు సమాచారం

కమిటీ నివేదిక రేపు కలెక్టర్ చేతికి!

వివాదం తాలూకా పూర్వాపరాలపై విచారణ చేపట్టి సమగ్ర నివేదిక ఇవ్వాలని కలెక్టర్ వినోద్‌కుమార్ ఓ కమిటీని గతంలో నియమించిన సంగతి తెలిసిందే. ఇంతకుముందు కలెక్టర్‌గా విధులు నిర్వహించిన వెంకటమురళి కూడా ఈ వివాదంపై కమిటీని నియ మించడం, నివేదిక తీసుకోవడం జరిగింది. కానీ తాజా కమిటీలో చీరాల ఆర్డీవో, డీఎస్పీకి కూడా చోటు కల్పించారు. నివేదికను కొలిక్కి (మిగతా 8వ పేజీలో)


సర్వే చేస్తున్న బాపట్ల తహసీల్దార్ షేక్ సలీమా (పాత చిత్రం)

చిన్నారిపై లైంగిక దాడి చేసిన వ్యక్తి అరెస్టు

● నిందితుడ్ని రోడ్డుపై నడిపించిన పోలీసులు



ఆస్పత్రి నుంచి కోర్టు వరకు నిందితుడ్ని నిడిపించి తీసుకెళ్తున్న పోలీసులు

చీరాల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): చీరాల మండలం ఈపూరుపాలెం పరిధిలో ఏడేళ్ల బాలికపై లైంగిక దాడి చేసిన పిట్ల సూరిబాబు అలియాస్ బిట్లను పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. పప్పులు కొనిస్తానని చిన్నారిపై ఓ వ్యక్తి లైంగిక దాడికి పాల్పడి పారిపోయాడు. పోక్సో కేసు నమోదు చేసిన పోలీసులు బుధవారం అరెస్టు చేసి ఈపూరుపాలెం స్టేషన్‌లో మీడియా ఎదుట హాజరుపరిచారు. ఆ తర్వాత చీరాల ఏరియా హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. పరీక్షల అనంతరం నిందితుడ్ని కోర్టు వరకు కాలి నడకన నడిపించారు. చిన్నారులపై అఘాయిత్యాలకు పాల్పడితే చర్యలు తప్పవని డీఎస్పీ ఎండీ మొయిన్, సీఐ శేషగిరిరావు, ఎస్ఐ చంద్రశేఖర్ ఈ సందర్భంగా హెచ్చరించారు.

మోదీ సభకు ఆర్టీసీ బస్సులు

- కర్నూలుకు 250పైనే సర్వీసులు కేటాయింపు
- గుంటూరు నుంచి 180, బాపట్ల నుంచి 40 బస్సులు
- సామాన్య ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చర్యలు

గుంటూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): సూపర్ జీఎస్టీ 2.0 సభకు కర్నూలుకు గురువారం విచ్చేస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ సభకు ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి ఆర్టీసీ బస్సులు తరలివెళుతున్నాయి. జీఎస్టీ సంస్కరణల తర్వాత గురువారం కర్నూలులో ప్రధాని నరేంద్రమోదీ, సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హాజరుకానున్న సభకు భారీగా జన సమీకరణ చేయనున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి 250 పైనే ఆర్టీసీ సర్వీసులు తరలివెళ్లనున్నాయి. అదే సమయంలో సామాన్య ప్రయాణికులకు ఎక్కడా ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు స్పష్టం చేశారు. ప్రధాని సభకు సంబంధించి జన సమీకరణకు కండీషన్‌లో ఉన్న బస్సులు సమకూర్చాలని ఉన్నతాధికారుల నుంచి కూడా స్పష్టమైన ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ మేరకు గుంటూరు- 1, 2 డిపోలతో పాటు పొన్నూరు, మంగళగిరి, తెనాలి డిపోల నుంచి 180 సర్వీసులు అందుబాటులో ఉంచుతున్నట్లు అధికారులు తెలిపారు. అలానే బాపట్ల జిల్లా నుంచి 40 సర్వీసులు ప్రధాని సభకు తరలిస్తున్నట్లు బాపట్ల జిల్లా ప్రజా రవాణాధికారి సామ్రాజ్యం తెలిపారు. పల్నాడు నుంచి కూడా అదనపు బస్సులు ప్రధాని సభకు తరలిస్తున్నారు. ఆయా బస్సులను బుధవారం రాత్రి నుంచే గమ్యస్థానాలకు చేర్చారు. నియోజకవర్గాల నుంచి జన సమీకరణకు సంబంధించి ప్రజాప్రతినిధులు బాధ్యత తీసుకుంటున్నారు. ప్రజాప్రతినిధుల సూచనల మేరకు బస్సులను ఆయా ప్రాంతాలలో గురువారం ఉదయమే అందుబాటులో ఉంచనున్నారు.



192.42 ఎకరాల్లో ఆక్వా పార్కు

● ఏడాదిలో పూర్తి చేయాలని ఆదేశాలు ● పనుల పరిశీలనలో కలెక్టర్ వినోద్‌కుమార్ ● స్వదేశీ దర్శన్ 2.0లో సూర్యలంక బీచ్ అభివృద్ధి

రేపల్లె, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): నిజాంపట్నం మండలంలోని యేమినేనివారిపాలెంలో ఆక్వాపార్కుకు 192.42 ఎకరాల్లో అభివృద్ధి చేస్తున్నట్లు కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. యేమినేనివారిపాలెం హార్బర్‌లో ఇంటిగ్రేటెడ్ ఆక్వా పార్కు, ఓడరేవు అభివృద్ధి పనులను కలెక్టర్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆక్వాపార్కు, ఓడరేవు నిర్మాణం ద్వారా మత్స్య, ఆక్వా రంగం మరింత అభివృద్ధి అవుతుందని, మత్స్యకారులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. టెండర్ ప్రక్రియ పూర్తయినా ఆక్వాపార్కు పనులు ప్రారంభించకపోవడానికి గల కారణాలపై మెరైన్ బోర్డు అధికారులను అడిగి తెలుసుకున్నారు. మొక్కలను తొలగించి రోడ్డు నిర్మాణం ప్రారంభించినట్లు కాంట్రాక్టర్ తెలిపారు.పనులను సంవత్సరంలో పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మత్స్య శాఖ జేడీ శ్రీనివాస్‌నాయక్, ఉపసంచాలకులు గాలిదేవుడు, ఆర్డీవో రామలక్ష్మి, ఇన్‌చార్జ్ తహసీల్దారు శ్రీనివాసరావు, మెరైన్‌బోర్డు డీఈ సూర్యనారాయణ పాల్గొన్నారు.

బీచ్ పనులను ప్రారంభించాలి

బాపట్ల: స్వదేశీ దర్శన్ 2.0 కింద సూర్యలంక బీచ్ అభివృద్ధి పనులను గురువారం నుంచి ప్రారంభించాలని కలెక్టర్ తెలిపారు. కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్వదేశీ దర్శన్ 2.0 కింద సూర్యలంక బీచ్ అభివృద్ధికి కేంద్రప్రభుత్వం రూ.97.52 కోట్లు విడుదల చేసిందన్నారు. 3.5 ఎకరాల విస్తీర్ణంలో పర్యాటకుల సౌకర్యార్థం మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. 1.5 కిలోమీటర్ల దూరం వరకు బోట్ల ద్వారా కెనల్‌లో పర్యటించేందుకు అభివృద్ధి చేయాలన్నారు. ఆయా పనులు 2026 సెప్టెంబరుకి పూర్తి చేయాలన్నారు. ఓడరేవు-చిలకలూరిపేట జాతీయ రహదారి 167ఏ నిర్మాణం సత్వరమే పూర్తి చేయాలని కలెక్టర్ చెప్పారు. ఈ సమావేశంలో పర్యాటకశాఖాధికారి నాగిరెడ్డి, జిల్లా మత్స్యకాధికారి శ్రీనివాసనాయక్ పాల్గొన్నారు.


ఇంటిగ్రేటెడ్ ఆక్వా పార్కు ఫిషింగ్‌హార్బర్ మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

చురుగ్గా అండర్‌పాస్‌లు

హైవేపై రూ.67 కోట్లతో పనులు ● రాజుపాలెం, జొన్నతాళి వద్ద నిర్మాణం

మార్టూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): చెన్నై నుంచి కలకత్తా 216వ జాతీయ రహదారి మార్టూరు మండల పరిధిలో జొన్నతాళి రోడ్డు వద్ద, రాజుపాలెం కూడలి వద్ద అండరుపాస్ నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. 15 ఏళ్ల క్రితం మార్టూరులో జాతీయరహదారిని దశలు వారీగా ఆరు లైన్లుగా విస్తరించారు. మార్టూరు సెంటరులో ఒక పెద్ద అండరుపాస్, రెండు చిన్న అండరుపాస్‌లు, ఇసుకదర్శి సెంటరు, కోనంకి సెంటరు వద్ద రెండు పెద్ద అండరుపాస్‌లను ఏర్పాటు చేశారు. అయితే రాజుపాలెం కూడలి వద్ద, జొన్నతాళి రోడ్డు వద్ద అండరుపాస్‌లను నిర్మించలేదు. చీరాల నుంచి వినుకొండ వెళ్లే వారు మార్టూరులో జాతీయరహదారిని దాటేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో రాజుపాలెం కూడలి వద్ద పెద్ద అండరుపాస్ ఏర్పాటు చేస్తున్నారు. జొన్నతాళి రోడ్డు వద్ద రోడ్డుకు రెండు వైపులా గ్రానైట్ పరిశ్రమలు ఉండటంతో, వాటిలో ముడిరాయిని బల్లికురవ, సంతమాగులూరు మండలాల నుంచి లారీల్లో తరలిస్తుంటారు. ఇక్కడ కూడా అండర్ పాస్ నిర్మాణం చేపట్టారు. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు చొరవతో రూ.67 కోట్లతో నిర్మిస్తున్న అండర్‌పాస్‌లతో వాహనదారులకు ఇబ్బందులు తొలిగిపోనున్నాయి. వచ్చే ఏడాది మార్చిలోపు రెండు అండరుపాస్‌ల నిర్మాణాలు పూర్తయ్యే అవకాశాలు ఉన్నాయి.

సర్వీసు రోడ్లలో ప్రమాదాలు..

హైవేపై రెండు అండరుపాస్‌ల నిర్మాణాలతో జొన్నతాళి రోడ్డు, రాజుపాలెం కూడలి వద్ద కొంతమేర సర్వీసు రోడ్డులో వాహనాలు ప్రయాణిస్తున్నాయి. సర్వీసు రోడ్లలో వాహనాలు ఎదురెదురుగా వస్తున్న సమయంలో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. జొన్నతాళి రోడ్డు వద్ద సర్వీసు రోడ్డులో రాత్రి సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. జొన్నతాళి రోడ్డు సమీపంలో మద్యం దుకాణం ఉంది. ఈ క్రమంలో ఇక్కడ ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి.


జొన్నతాళి రోడ్డు వద్ద నిర్మాణంలో ఉన్న అండర్ పాస్


రాజుపాలెం కూడలి వద్ద నిర్మాణంలో ఉన్న బ్రిడ్జి

భూ సమస్యలన్నీ పరిష్కరిస్తాం

● జేసీగా బాధ్యతలు స్వీకరించిన భావన వశిష్ఠ


బాపట్ల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని భూ సమస్యలన్నీ పరిష్కరిస్తామని జేసీ భావన వశిష్ఠ తెలిపారు. జేసీగా బుధవారం భావన బాధ్యతలు స్వీకరించారు. తొలుత కలెక్టరేట్‌కు చేరుకున్న ఆమెకు అధికారులు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. వేదపండితుల మంత్రోచ్ఛరణ, పూర్ణకుంభంతో స్వాగతిస్తూ కార్యాలయంలో పూజలు నిర్వహించారు. జేసీగా బాధ్యతలు చేపట్టిన ఆమె కలెక్టర్ వినోద్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి మొక్క అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రెవెన్యూ వ్యవస్థలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ప్రజలు భూసమస్యలతో ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజలకు మేలు చేయడమే లక్ష్యంగా పనిచేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా డీఆర్వో జి.గంగాధర్‌గౌడ్, కలెక్టరేట్ ఏవో మల్లికార్జునరావు, ఆర్డీవోలు పి.గ్లోరియా, చంద్రశేఖర్‌నాయుడు, ఎన్.రామలక్ష్మి, తహసీల్దార్ షేక్.సలీమా స్వాగతం పలికారు.


కలెక్టర్ వినోద్‌కుమార్‌కు మొక్క అందజేస్తున్న జేసీ భావన వశిష్ఠ

సీసీ రోడ్లకు రూ.9.78 కోట్లు

ఎమ్మెల్యే ఏలూరి చొరవతో కొత్తరూపు

కారంచేడు(పర్చూరు), అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కారంచేడు మండల రహదారుల అభివృద్ధికి ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ప్రత్యేక చొరవతో రూ.9.78 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో రోడ్లు కొత్త రూపు సంతరించుకోనున్నాయి. ఎస్ఆర్ఈజీఎస్ కింద సీసీ రోడ్లు, డ్రెయిన్ల అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయి. మండలంలోని ఆదిపూడి గ్రామానికి రూ.52.50 లక్షలు, దగ్గుబాడు గ్రామంలో ఏడు పనులకు రూ.82.50 లక్షలు, జరుబులవారిపాలేనికి రూ.35 లక్షలు, కేశవరప్పాడుకి రూ.35 లక్షలు, కొడవలివారిపాలేనికి రూ.55 లక్షలు, కుంకలమర్రుకి రూ.77.50 లక్షలు, నాయుడువారిపాలేనికి రూ.55 లక్షలు, రంగప్పనాయుడువారిపాలేనికి రూ.20 లక్షలు, స్వర్ణ గ్రామానికి రూ.1.10 కోట్లు, తిమిడితివారిపాలేనికి రూ.80.50 లక్షలు, కారంచేడులో 16 పనులకు రూ.2.49 కోట్లు, యర్రంవారిపాలెం గ్రామానికి రూ.10 లక్షల చొప్పున నిధులు మంజూరయ్యాయి.



అవీ.. ఇవీ



కోటపాడు మైనర్‌లో తూములు మూసుకుపోయి కట్టలుపొర్లి పొలాల్లో ప్రవహిస్తున్న సాగర్‌జలాలు

మూసుకుపోయిన తూములు

● పంట పొలాలను ముంచెత్తుతున్న సాగర్‌జలాలు

పంగులూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి):పమిడిపాడు మేజర్ పరిధిలోని కోటపాడు మైనర్‌లో డ్రాపువద్ద తూములు మూసుకుపోయి సాగర్ జలాలు పంటపొలాలను ముంచెత్తుతున్నాయి. దీంతో పంటలు వేసిన రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని కొండమంజులూరు, కోటపాడు గ్రామాల మధ్య కోటపాడు మైనర్‌లో డ్రాపువద్ద తూములు పూర్తిగా మూసుకుపోయాయి. కాలువలో వచ్చే సాగర్ జలాలు ముందుకు పోయే వీలులేక కట్టలుపొర్లి పొలాలను ముంచెత్తడంతో సాగుపనులు నిలిచిపోయాయని రైతులు గగ్గోలు పెడుతున్నారు.గత కొద్ది రోజులుగా నెలకొన్న ఈ పరిస్థితిని అధికారులు దృష్టికి తీసుకెళ్లినా సమస్యను పరిష్కరించలేదని కోటపాడు, కొండమంజులూరు గ్రామాల రైతులు ఆరోపిస్తున్నారు. వరినాట్లు వేసుకునే సమయంలో తమ పొలాలు సాగర్‌జలాలతో వరదను తలపిస్తున్నాయని,వ్యవసాయ పనులు నిలిచిపోయి ఇబ్బంది పడుతున్నామని రైతులు వాపోతున్నారు. సమస్యను తక్షణమే పరిష్కరించాలని మైనర్ పరిధిలోని రైతులు సాగర్ అధికారులను కోరుతున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో వరూధిని

ఈకేవైసీ త్వరితగతిన పూర్తి చేయాలి

అద్దంకిటౌన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి):గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద పనులకు వచ్చే జాబ్ కార్డుదారులకు ఈకేవైసీ త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీవో బి. వరూధిని సూచించారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలోని ఎన్‌ఆర్‌ఈజీఎస్ కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్‌లు, టీఏలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ఇప్పటి వరకు ఉన్న ఉపాధి హామీ పథకం జాబ్ కార్డుదారులు, పూర్తి చేసిన ఈకేవైసీ, చేయాల్సిన విషయాలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మండలంలో మొత్తం జాబ్ కార్డుదారులు 20,188 మంది ఉండగా వారిలో 12,800 ఈకేవైసీ పూర్తి చేయడం జరిగిందని ఏపీవో నాగ శివకోటేశ్వరి ఎంపీడీవోకు తెలియజేశారు. మండలంలోని గ్రామాల్లో నిర్మాణంలో ఉన్న మినీ గోకులం షెడ్‌లు పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. నిర్మాణాలు ప్రారంభించిన వాటిని వెంటనే పూర్తి చేసుకునేలా చూడాలన్నారు. హౌసింగ్‌కు సంబంధించి 90 రోజుల పనిదినాలపై ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఈసీ నాగరాజు, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

చెన్నకేశవుని అభిషేకించిన భానుడి కిరణాలు

పంగులూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి):మండలంలోని చందలూరు గ్రామంలో శ్రీభూనీళాసమేత చెన్నకేశవస్వామి ఆలయంలో స్వామివారిని భానుడి కిరణాలు అభిషేకించాయి. బుధవారం ఉదయం 6గంటల 20 నిమిషాల నుంచి 6.30 నిమిషాల వరకు జరిగిన ఈ అపూర్వ ఘటనను పలువురు భక్తులు తిలకించారు. సౌరమానంను అనుసరించి ప్రతి సంవత్సరం ఉత్తరాయణం, కుంభ సంక్రమణం శతభిషం కార్తెలో ఫిబ్రవరి 27,28 తేదీలలో ఉదయం 6గంటల 30 నిమిషాల నుంచి 6గంటల 50 నిముషాల వరకు, దక్షిణాయణం కన్యా సంక్రమణ, చిత్తకార్తెలో అక్టోబరు 14,15తేదీలలో ఉదయం 6గంటల 10 నిముషాల నుంచి 6గంటల 30 నిముషాల వరకు స్వామివారిని ఆపాదమస్తకం సూర్యకిరణాలు అభిషేకిస్తాయని అర్చకస్వామి రఘునాధాచార్యులు తెలిపారు.



చందలూరులో శ్రీచెన్నకేశవస్వామి ఆలయంలో మూలవిరాట్‌ను అభిషేకిస్తున్న సూర్యకిరణాలు

రోడ్డు నిర్మాణ పనుల్లో జాప్యం

● అవస్థలు పడుతున్న ప్రజలు

అద్దంకి,అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): రోడ్డు పునర్‌నిర్మాణ పనులు నిదానంగా జరుగుతుండటంతో వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. మండలంలోని శాంతినగర్ నుంచి మైలవరం వరకు సుమారు 10 కి.మీ రోడ్డు ను రెండు దశాబ్దాల క్రితం నిర్మించగా పూర్తిగా గోతుల మయంగా మారింది. కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తరువాత మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రత్యేక దృష్టి సారించి 5.10 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేయించారు. రెండు నెలల క్రితం రోడ్డు నిర్మాణ పనులు కూడా ప్రారంభమయ్యాయి. రోడ్డు వెడల్పు విస్తరించాల్సి ఉండటంతో రెండు వైపులా మార్జిన్‌లు తవ్వి గ్రావెల్ పోశారు. దీంతో ఇటీవల కురుస్తున్న వర్షాలకు మార్జిన్‌లో పోసిన గ్రావెల్ మొత్తం రోడ్డు మీదకు చేరి బురదమయంగా మారింది. దీంతో ద్విచక్ర వాహనచోదకులు జారుతూ ప్రమాదాలకు గురవుతున్నారు. రోడ్డు నిర్మాణ పనులు వేగవంతంగా జరిగి ఉంటే ఇప్పటికే మెటల్ పరిచి ఉంటే రాకపోకలకు ఇబ్బంది లేకుండా ఉండేదని, అలా కాకుండా పనులు నిదానంగా జరుగుతుండటంతో ఇబ్బందులు పడాల్సి వస్తుందని వెంపరాల, ఉప్పలపాడు, మైలవరం, ఏలేశ్వరవారిపాలెం గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా పనులు వేగవంతంగా జరిగేలా అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



పొలాలకు వెళ్లే రోడ్డులా మారిన శాంతినగర్-మైలవరం రోడ్డు

కర్నూలుకు బస్సులు

గ్రామీణ రూట్లలో సర్వీసుల రద్దుతో ప్రయాణికుల ఇక్కట్లు

అద్దంకి,అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పర్యటన నేపథ్యంలో అద్దంకి డిపో నుంచి 27 బస్సులను పంపారు. మొత్తం 69 బస్సులు ఉండగా అందులో 27 బస్సులు కర్నూలుకు పోవడంతో పలు గ్రామీణ రూట్లలో బుధవారం బస్సులు రద్దు అయ్యాయి. నర్సరావుపేట, ఒంగోలు, వినుకొండ తదితర ప్రధాన రూట్లలో కొంతమేర బస్ సర్వీసులు నడపగా గ్రామీణ ప్రాంతాల సర్వీసులు రద్దు చేయటంతో ప్రయాణికులు ఎక్కువ సమయం వేచి ఉండాల్సి రావటంతో పాటు గమ్య స్థానాలకు చేరటానికి ఆటోలను ఆశ్రయించక తప్పలేదు. గురువారం కూడా ఇదే పరిస్థితి కొనసాగనుంది. శుక్రవారం ఉదయం నుంచి యధావిధిగా అన్ని రూట్లలో బస్సులు నడవనున్నాయి.



అద్దంకి ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు

మండల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయాలి

చినగంజాం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి) : మండల సర్వతోముఖాభివృద్ధికి సభ్యులు, అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలని ఇన్‌చార్జి మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు తుమ్మలపెంట ప్రసన్నలక్ష్మి అన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశపు హాల్‌లో ఇన్‌చార్జి ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం బుధవారం జరిగింది. మండలంలో పర్యాటక రంగం అభివృద్ధికి కృషి చేస్తామని ఎంపీడీవో కె.ధనలక్ష్మి అన్నారు. గ్రామాల్లో సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందికి సూచించారు. కడవకుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కుకింగ్ ఏజెన్సీ వారు మధ్యాహ్న భోజనాన్ని సరిగా వండకపోవడంతో విద్యార్థులు భోజనం తినలేక మధ్యలోనే వదిలేస్తున్నారని ఆ గ్రామ సర్పంచ్ గొల్లమూరి శివకుమారి ఎంఈవో-2 కోటేశ్వరరావు దృష్టికి తెచ్చారు. పాఠశాలలోని మధ్యాహ్నభోజనాన్ని పరిశీలిస్తామని ఎంఈవో, ఎంపీడీవో తెలిపారు. కొత్తపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని మూలగా నివారిపాలెం గ్రామంలో శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనంలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని, ప్రమాదాలు జరగకముందే పాఠశాల భవనాన్ని తొలగించాలని, అలాగే ఓ ప్రైవేట్ పాఠశాలకు అనుమతులు ఇవ్వడంపై కొత్తపాలెం సర్పంచ్ ఆసోది బ్రహ్మారెడ్డి ప్రశ్నించారు. ఇళ్ల పట్టాలకు అర్హత కలిగిన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ జీవి గుంట ప్రభాకరరావు తెలిపారు. మండల స్థాయి అధికారులు తమ శాఖల ప్రగతిని సభలో చదివి వినిపించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండల స్థాయి అధికారులు, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.



మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ ప్రసన్నలక్ష్మి

ఎవరినడిగి... 'సీమౌత్' పూడ్చారు !

(5వ పేజీ తరువాయి)

తెచ్చే ప్రక్రియలో భాగంగా ఈపూరుపాలెం స్ట్రెయిట్‌కట్ డ్రెయిన్ సముద్రంలో కలిసే ప్రాంతంలో మంగళవారం రెవెన్యూ అధికారులు సర్వే చేపట్టారు. డ్రైనేజీ విస్తీర్ణం ఎంత అనే అంశంతో పాటు పట్టా, డీకే భూముల వివరాలు హద్దులతో సహా సర్వే చేసి నివేదికలో పొందుపరిచారు. ఈ వివరాలతో పాటు గతంలో జరిగిన ఘటనల సమగ్ర వివరాలతో రిపోర్టును శుక్రవారం కలెక్టర్ వినోద్‌కుమార్‌కు అందించడానికి కమిటీ సిద్ధమవుతోంది

నిబంధనలపై ముమ్మర కసరత్తు...

తీర ప్రాంత భూముల విషయంలో అవలంభించాల్సిన నిబంధనలపై రెవెన్యూ యంత్రాంగం ముమ్మర కసరత్తు చేస్తోంది. దానిలో భాగంగా గతంలో జరిగిన కొన్ని కేస్ స్టడీస్‌ను కూడా పరిశీలన చేస్తున్నారు. తీర ప్రాంత భూములపై యాజమాన్య హక్కు కలిగి ఉన్నప్పటికీ, సదరు విభాగాల అనుమతి లేకుండా ప్రవాహం దిశ మార్చడం నిబంధనల ఉల్లంఘన కిందకే వస్తుందనే ప్రాథమిక అంచనాకు సదరు విభాగాలు వచ్చినట్లు తెలుస్తోంది. స్టేట్‌మెంట్ రికార్డు సమయంలో రియల్టర్ బుర్ల వెంకట్రావును ఇదే విషయంపై వివరణ అడిగినట్లు తెలుస్తోంది. ఇదే కాకుండా సీమౌత్ వివాదంలో కొంత అసైన్డ్ భూమి భాగమై ఉండడం ఒక ఎత్తయితే పట్టా భూమి రికార్డుల విషయంలో కూడా అనేక సందేహాలను కమిటీ ఇవ్వబోతున్న నివేదికలో పొందుపరిచినట్లు తెలుస్తోంది

వివాదానికి ముగింపు పలకాల్సిందే...

దాదాపు మూడు నెలలుగా ఈపురుపాలెం స్ట్రెయిట్‌కట్ విషయంలో మత్స్యకారులు వివిధ రూపాలలో ఆందోళనలు చేస్తున్న సంగతి తెలిసిందే. పలుమార్లు ధర్నాలు, కలెక్టరేట్ ముట్టడిలాంటి కార్యక్రమాలతో ఉద్రిక్త వాతావారణం కూడా కొన్ని సందర్భాల్లో ఏర్పడుతోంది. ఈ వివాదానికి ఎట్టి పరిస్థితుల్లో మరో వారం రోజుల్లో ముగింపు పలకాల్సిందేనని కలెక్టర్ వినోద్‌కుమార్ పట్టుదలతో ఉన్నట్లు తెలుస్తోంది. దీనిలో భాగంగానే కమిటీ ఇచ్చే నివేదికతో పాటు వివిధ మార్గాలలో ఆ వివాదంపై సమాచారం తెప్పించుకునే పనిలో నిమగ్నమయ్యారు.

శివ నాగేశ్వరరావు మృతికి ఏలూరి సంతాపం

మార్టూరు,అక్టోబరు15(ఆంధ్రజ్యోతి):మండలంలోని చిమ్మిరిబండ గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు, విజయ డెయిరీ పాల ఉత్పత్తిదారుల సంఘం మాజీ అధ్యక్షుడు శివ నాగేశ్వరరావు అనారోగ్య కారణంతో మంగళవారం మృతి చెందాడు. ఆయన మృతి పట్ల ఎమ్మెల్యే ఏలూరి సాంబ శివరావు బుధవారం ఓ ప్రకటనలో సంతాపం తెలిపారు. ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన కుటుంబసభ్యులకు తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందన్నారు.

బాధిత కుటుంబాలకు టీడీపీ ఆర్థిక సహాయం

చీరాల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : బాధిత కుటుంబాలకు టీడీపీ కూటమి ఎల్లప్పుడూ అండగా ఉంటుందని యువనాయకులు గౌరీ అమర్నాధ్ పేర్కొన్నారు. వడ్డెసంఘంకు చెందిన ఇరువురు విద్యార్థులు ఇటీవల తీరంలో మృత్యువాత పడిన సంఘటన పాఠకులకు విదితమే. ఈక్రమంలో టీడీపీ యువనాయకులు గౌరీ అమర్నాధ్ బుధవారం ఆయా కుటుంబాలను పరామర్శించి చెరో రూ.50 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ ఘటనపై విచారం వ్యక్తం చేశారు. ఆయన వెంట పలువురు నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ ఉపసంహరించుకోవాలి

రాష్ట్ర ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రయివేటీకరణ చేయడం అవివేకమని, వెంటనే ఆలోచన వెనక్కు తీసుకోవాలని మాజీ ఎంఎల్‌సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. బుధవారం స్థానిక బాపనమ్మ కల్యాణ మండపంలో జేవీవీ, జీపీవీ, యూటీఎఫ్, ఎస్ఎఫ్ఐ, సీఐటీయూ సంయుక్త ఆధ్వర్యంలో సెమినార్ నిర్వహించారు.

జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక

చినగంజాం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి) : జిల్లా స్థాయి కబడ్డీ, వాలీబాల్ పోటీలకు విద్యార్థులు ఎంపికైనట్లు చినగంజాం జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కొమ్మారెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం జరిగిన అభినందనసభలో జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను హెచ్ఎం, ఉపాధ్యాయులు, పీడీలు అభినందించారు. కబడ్డీ అండర్-17 విభాగంలో హర్ష, వంశీకర్, కబడ్డీ అండర్-14 విభాగంలో వేణు, అజయ్, మణికంఠరెడ్డి, కారాని సాయి, వాలీబాల్‌లో గోపిచంద్, ఉస్మాన్‌లు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు.

క్రీడాపోటీల్లో చందలూరు విద్యార్థుల ప్రతిభ

పంగులూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): డివిజన్‌స్థాయి క్రీడా,ఆటల పోటీలలో చందలూరు ఉన్న త పాఠశాల విద్యార్థులు సత్తాచాటి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్ -17 కబడ్డీలో బి.సాయిసందీప్, వాలీబాల్‌లో కె.ఈశ్వర్ , 1500, 3వేల మీటర్ల పరుగు పందెం లో ఎం.విష్ణువర్ధన్‌రెడ్డి, యోగా పోటీలలో అండర్-17లో నాయపాము శృతి, భవ్య, అండర్-14లో కె.హెప్సిబా ప్రతిభచూపి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయినట్లు పాఠశాల పీడీ .ప్రతిమ,మధుమూర్తి తెలిపారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

కొత్తపేట(చీరాల), అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : తీరంలో వేటపాలెం మండలం కొత్తపేట పంచాయతీ వడ్డెసంఘంకు చెందిన ఇరువురు విద్యార్థుల మృతి తనను కలచి వేసిందని మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ అన్నారు. ఇటీవల కుమారులను కోల్పోయి శోకసంద్రంలో ఉన్న రెండు కుటుంబాల సభ్యులను మంగళవారం రాత్రి పరామర్శించారు.

'వచ్చే ఎన్నికల్లో వైసీపీ నుంచే పోటీచేస్తా'

రామకృష్ణాపురం(చీరాల), అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీ నుంచే పోటీచేస్తానని, ఇందులో ఏమార్పు ఉండదని నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ స్పష్టం చేశారు. బుధవారం ఆ పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రామకృష్ణాపురం క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వం మెడికల్ కళాశాలల పట్ల అవలంబిస్తున్న తీరుపై విమర్శలు గుప్పించారు. ఈ సందర్భంగా పోస్టర్‌ను ఆవిష్కరించారు.

న్యాయం చేయాలని హోంగార్డు ఇంటిముందు భార్య బైఠాయింపు

బోయినవారిపాలెం(చీరాల), అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : తనకు న్యాయం చేయాలని హోం గార్డు ఇంటి ముందు భార్య బైఠాయించింది. మండల పరిధిలోని బోయినవారిపాలెంకు చెందిన బోయిన చంద్రశేఖర్ జిల్లా ఎస్పీ కార్యాలయంలో హోం గార్డుగా విధులు నిర్వహిస్తున్నారు. ఇతనికి గతకొన్ని సంవత్సరాల క్రితం వేటపాలెం మండలం బచ్చులవారిపాలెంకు చెందిన సుగుణతో వివాహం జరిగింది. ఆతరువాత వారిమధ్య విభేదాలు చెలరేగాయి. ప్రస్తుతం వ్యవహారం కోర్టులోఉంది. ఇదిలా ఉండగా బుధవారం ఆమె భర్త ఇంటిముందు బైఠాయించి నిరసన తెలిపింది.

నిషేధమా అదెక్కడ..?

(5వ పేజీ తరువాయి)

పూర్తిగా విఫలమవుతోంది. నిషేధం ప్రచారానికే పరిమితమవుతోంది. యథేచ్ఛగా నిషేధిత ప్లాస్టిక్ వినియోగం, విక్రయాలు సాగుతున్నా... చర్యలు తీసుకోవాల్సిన యంత్రాంగం చోద్యం చూస్తోంది.

● పర్యావరణంపై తీవ్ర ప్రభావం

పర్యావరణం పై ప్లాస్టిక్ వ్యర్థాలు తీవ్ర ప్రభావం చూపుతాయి. కాలువల్లో పూడిక తీసే సమయంలో పెద్ద ఎత్తున ప్లాస్టిక్ కవర్లు, సీసాలు, గ్లాసులు ఉంటున్నాయి. ఈ కవర్ల వినియోగంపై నియంత్రణ కనిపించటం లేదు. విందు, వినోదాలలో కూడా ప్లాస్టిక్ గ్లాసులు, పేపర్ సామగ్రిని వినియోగిస్తున్నారు. చివరకు కూరలు, అహారం ప్యాకింగ్‌లో కూడా ప్లాస్టిక్ పేపర్, కవర్లను వాడుతున్నారు. వేడి అహార పదార్థాలను ప్లాస్టిక్ కవర్లలో ప్యాకింగ్ చేయడం వల్ల అవి కరిగి అహారంలో కలసిపోతూ ప్రాణ సంకటంగా మరుతున్నాయి. అలాగే పట్టణాలలో ఏ మురుగు కాలువ చూసినా ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు కన్పిస్తున్నాయి. మురుగు కాలువలు పూడి పోవటానికి ప్లాస్టిక్ ఒక కారణంగా ఉంది. పట్టణాలలో ప్రతిరోజు ఉత్పత్తి అయ్యే వ్యర్థాలలో నాలుగో వంతు ప్లాస్టిక్ వ్యర్థాలు ఉంటున్నాయి.

పారిశుధ్య పనుల మెరుగునకు చర్యలు

అద్దంకి,అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): పారిశుధ్య పనులు మెరుగు పరిచేందుకు చర్యలు తీసుకుంటున్నామని స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ చిన్ని లక్ష్మీశ్రీనివాసరావు అన్నారు. అద్దంకి పట్టణంలోని వేలమూరిపాడు రోడ్డులో ఉన్న ఎన్‌టీఆర్ నగర్(జగనన్న కాలనీ)లో బుధవారం ఆయన పారిశుధ్యాన్ని పరిశీలించారు. కాలనీ సమీపంలో రోడ్డు మార్జిన్‌లో వ్యర్థాలు పోసి ఉండటాన్ని గమనించారు. డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేయాలని కాలనీ వాసులు కోరారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ బలరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అసత్య ప్రచారాలు నమ్మవద్దు

అద్దంకి, అక్టోబరు15 (ఆంధ్రజ్యోతి): నకిలీ మద్యంపై ప్రజలు అసత్య ప్రచారాలు నమ్మవద్దని అద్దంకి ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌చార్జి సీఐ హర్షవర్ధన్ రెడ్డి తెలిపారు. అద్దంకి సర్కిల్ పరిధిలో 24 మద్యం షాపులు, ఒక బార్ ఉన్నాయని, ఇప్పటి వరకు ఎలాంటి నకిలీ మద్యం పట్టుబడలేదని అన్నారు. బెల్ట్‌షాపులకు మద్యం అమ్మకాలు చేయరాదన్నారు. అనధికారికంగా మద్యం అమ్మకాలు జరిగితే 6281288914, 9440902497 సెల్ నెంబర్‌లకు తెలియజేయాలన్నారు.

ఏబీసీలో బయటపడిన మహిళ మృతదేహం

బల్లికురవ, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి):మండల పరిధిలోని వైదన గ్రామ సమీపంలో అద్దంకి బ్రాంచ్ కాలువలో మంగళవారం రాత్రి బయటపడిన మహిళ మృతదేహానికి సంబంధించి కేసు నమోదు చేశామని ఎస్ఐ వై. నాగరాజు తెలిపారు. పల్నాడు జిల్లా వినుకొండ మండలం పిట్టంబండ గ్రామానికి చెందిన కర్రి పార్వతి(45)గా గుర్తించినట్లు తెలిపారు. మృతురాలి భర్త నాగేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అద్దంకి ప్రభుత్వ వైద్యశాలలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని వారికి అప్పగించామని ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతి

మార్టూరు,అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): బైక్‌ను గేదెలు ఢీకొని రోడ్డుపై పడిపోయి తీవ్రంగా గాయపడి ఐదు రోజులుగా గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఇస్తర్ల మరియమ్మ (70) అనే వృద్ధురాలు మంగళవారం రాత్రి మృతిచెందినట్లు ఏఎస్ఐ బాషా బుధవారం తెలిపారు. ఆమె కుమారుడు చినదాసు ఫిర్యాదు మేరకు బుధవారం గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో మృతదేహానికి పోస్టు మార్టం నిర్వహించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ బాషా తెలిపారు.

ఒడిశా వాసి ఆత్మహత్య

మార్టూరు,అక్టోబరు15(ఆంధ్రజ్యోతి):మండల పరిధిని జొన్నతాళి సెంటరులో కిళ్లీ బంకు నడుపుతున్న ఒడిశాకు చెందిన శ్రీధర్ దల్ (58) అనే వ్యక్తి గదిలో సీలింగ్ ఫ్యాన్‌కు కండువాతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన బుధవారం ఉదయం జరిగింది. ఆర్థికంగా అప్పులు ఉండటం, ఒంటరితనానికి గురికావడంతో తీవ్ర మానసిక వ్యధకు గురై ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిసింది. మృతుని కుమారుడు ప్రదీప్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ కోటేశ్వరరావు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చినగంజాం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి) : చినగంజాం సబ్‌స్టేషన్ పరిధిలో 11కేవీ విద్యుత్ లైన్‌ల మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ ఇన్‌చార్జి అసిస్టెంట్ ఇంజనీర్ ఎల్. బ్రహ్మం బుధవారం తెలిపారు. సోపిరాల, పూలవారిపాలెం, మున్నంవారిపాలెం, ఇండస్ట్రియల్-1 ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

బైక్ నుంచి పడి మహిళకు తీవ్రగాయాలు

మార్టూరు, అక్టోబరు15 (ఆంధ్రజ్యోతి): టీవీఎస్ వాహనంపై వెళుతున్న జెపంగులూరు మండలం రామకూరు గ్రామానికి చెందిన రాజ్యలక్ష్మిఅనే మహిళ పడిపోవడంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన బుధవారం మార్టూరు సెంటరు సమీపంలో ఒంగోలు వైపు వెళ్లే హైవేపై జరిగింది. ఆమె టీవీఎస్ వాహనంపై వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. స్థానికులు 108 కిసమాచారం ఇవ్వడంతో ఆస్పత్రికి తరలించారు.

సీల్డ్ టెండర్ కమ్ బహిరంగ వేలం ప్రకటన

గ్రామ పంచాయతీ, వైదన, బల్లికురవ మండలం


తేది :14-10-2025

బాపట్ల జిల్లా, బల్లికురవ మండలం, వైదన గ్రామ పంచాయతీ చేపల చెరువులో చేప పిల్లలు వేసి పెంచి పట్టుకొనుటకు

సీల్డ్ టెండర్ కమ్ బహిరంగ వేలం నిర్వహించుట గురించి.

వైదన గ్రామ పంచాయతీలో పంచాయతీ పెద్దచెరువు, చిన్నచెరువులలో చేప పిల్లలు వేసి పెంచి పట్టుకొనుటకు హక్కుకు **1435, 1436** ఫసలిలకు అనగా **2025-26**, మరియు **2026-27** అనగా రెండు సంవత్సరాలకు కలిపి సీల్డ్ టెండర్ కమ్ బహిరంగ వేలం వేయటకు **తేది.24-10-2025**న గ్రామ పంచాయతీ కార్యాలయము నందు **ఉదయం 10:00** గంటల నుండి మధ్యాహ్నం **1:00** గంట వరకు సీల్డ్ టెండర్ నిర్వహించబడి అదే రోజు మధ్యాహ్నం **3:00** గంటలకు శ్రీయుత జిల్లా పంచాయతీ అధికారి లేక వారి అనుమతి పొందిన వారి సమక్షంలో వేలం నిర్వహించబడును. రూ.8,00,000/- ధరావత్తు చెల్లించి సీల్డ్ టెండర్ కమ్ బహిరంగ వేలం పాటలో పాల్గొనవలయును వివరములకు గ్రామ పంచాయతీ కార్యాలయములో ఆఫీసు పనిచేయు వేళల యందు సంప్రదించగలరు. పాట వాయిదా వేయుటకు గ్రామ పంచాయతీకి అధికారము కలదు.

బి.ప్రసాదరావు, పంచాయతీ కార్యదర్శి,
వైదన, బల్లికురవ మండలం, బాపట్ల జిల్లా





నేటి నుంచి ఇసుక తవ్వకాలు

- 15తో ముగిసిన గ్రీన్‌ట్రిబునల్ ఆదేశాలు
- జిల్లా మైనింగ్ అధికారి శ్రీనివాసరావు

నెల్లూరు(వెంకటేశ్వరపురం), అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో గురువారం నుంచి నిర్మాణాలకు ఉచిత ఇసుక తవ్వకాలు చేసుకోవచ్చని జిల్లా మైనింగ్ అధికారి శ్రీనివాసరావు ఒక ప్రకటలో తెలిపారు. జాతీయ గ్రీన్ ట్రిబునల్ ఆదేశాల మేరకు జూన్ 1 నుంచి అక్టోబరు 15 వరకు నదుల్లో ఇసుక తవ్వకాలపై ఉన్న నిషేధం ముగిసిందన్నారు. గురువారం నుంచి పూర్తిస్థాయిలో ఉచిత ఇసుక విధానం తిరిగి అమల్లోకి రానున్నదని ఆయన తెలిపారు. బల్క్‌గా అవసరమైన వారు అనుమతులు ఉన్న పల్లిపాడు,అప్పారావుపాళెం, మినగల్లు ,విరువూరు రీచ్‌ల్లోంచి లోడింగ్ చార్జీలు చెల్లించి ఇసుకను పొందవచ్చని తెలిపారు. డీ సిలిటేషన్ పాయింట్‌లైన నెల్లూరు, పోతిరెడ్డిపాళెం,సంగం, సూరాయపాళెం, కలువాయి,రాజుపాళెం స్టాక్ పాయింట్లలో ఇసుక అందుబాటులో ఉంటుందని ఆయన వివరించారు. సామాన్యుల ఎడ్లబండ్లు, ట్రాక్టర్ల ద్వారా నదులు,వాగులు,కా లువలు,వంకల నుంచి ఇసుకను ఉచితంగా తీసుకువెళ్లవచ్చని తెలిపారు. నిర్మాణానికి ఎంత ఇసుక అవసరమో సచివాలయంలో తెలిపి అనుమతిపత్రం తీసుకోవాలన్నారు. ఉచితంగా ఇసుక రవాణా చేసే ప్రతీ వాహనం ముందుభాగంలో ఉచిత ఇసుక అంటూ బ్యానర్‌ను ఏర్పాటు చేసుకోవాలని ఆయన తెలిపారు.

ప్రధానితో ఇంటరాక్షన్‌కు
సంగం టీచరు, విద్యార్థి


కర్నూలుకు బయలుదేరిన విద్యార్థి, ఉపాధ్యాయుడు

సంగం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కర్నూలు పర్యటనకు గురువారం వస్తున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సభలో జీఎస్టీ రీఫార్మ్ 2.0పై మోదీతో ఇంటరాక్షన్ కార్యక్రమానికి సంగం జడ్పీ హైస్కూల్‌కి చెందిన సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయుడు టీ. సుబ్రహ్మణ్యం, 10వ తరగతి విద్యార్థి యశ్వంత్‌కు ఆహ్వానం అందింది. దీంతో వారు కర్నూలుకు బయలుదేరారు. ఈ సందర్భంగా వారిని హెచ్‌ఎం బుజ్జయ్య, సహచర ఉపాధ్యాయులు అభినందించారు.

ఆరోపణలపై అన్వేషణ

- రేషన్ మాఫియాపై నిగ్గుతేల్చేందుకు మంత్రి సన్నద్ధం
- జిల్లా సివిల్ సప్లయ్స్ అధికారులకు అమరావతికి పిలుపు
- మాఫియా నేతలు ఎవరు... వారి వెనుకున్న రాజకీయ శక్తులు ఏవి?


స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం లారీల వద్ద సివిల్ సప్లయ్స్ అధికారులు(ఫైల్)

నెల్లూరు, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రేషన్ బియ్యం పక్కదారిపడుతోందన్న ఆరోపణల్లో వాస్తవాలను తెలుసుకునేందుకు రాష్ట్ర సివిల్ సప్లయ్స్ శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఉపక్రమించారు. ఇందుకోసం జిల్లా సివల్ సప్లయ్స్ అధికారి విజయ్‌కుమార్, జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ అర్జునరావును అమరావతికి పిలిపించారు. రేషన్ బియ్యం పక్కదారి పడుతోందని, కొందరు అధికార పార్టీ నాయకులే మాఫియా లీడర్లుగా వ్యవహరిస్తున్నారని నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి ప్రెస్‌మీట్‌లో ఆరోపించడం, ఆ ప్రెస్‌మీట్‌లో సివిల్ సప్లయ్స్ మంత్రి నాదెండ్ల మనోహర్ పేరును కూడా ప్రస్తావించడంతో కూటమి ప్రభుత్వంలో దుమారం రేగింది. నాదెండ్ల ఫిర్యాదుతో స్పందించిన టీడీపీ అధిష్ఠానం నుడా ఛైర్మన్‌ను పత్రికాముఖంగా నాదెండ్లకు క్షమాపణ చెప్పమని ఆదేశించింది. ఈ క్రమంలో బుధవారం కోటంరెడ్డి విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి తన వ్యాఖ్యలకు వివరణ ఇచ్చుకున్నారు. అయితే ఈ విషయాన్ని మంత్రి నాదెండ్ల మనోహర్ సీరియస్‌గా తీసుకున్నారు. కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి చేసిన ఆరోపణల్లో వాస్తవాలు తెలుసుకోవడం కోసం విచారణ మొదలుపెట్టారు. ఈ క్రమంలో జిల్లా పౌరసరఫరాలశాఖ మేనేజర్లను అమరావతికి పిలిపించారు.

మూడు లారీలను వదిలి పెట్టారనే ఆరోపణలు

గతనెల 21న నెల్లూరు మూడో మైలు వద్ద గల సుభాన్‌నగర్‌లో ఐదు లారీల్లోని 180 టన్నుల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. ఇందులో రెండు లారీలను రేషన్ బియ్యంగా గుర్తించి సీజ్ చేశారు. మూడు లారీల్లో సాధారణ బియ్యంగా గుర్తించి వదిలిపెట్టారు. ఈ విషయాన్ని కోటంరెడ్డి తప్పుపట్టారు. సివిల్ సప్లయ్స్ అధికారులు రాజకీయ ఒత్తిళ్లకు లొంగి మూడు లారీలను వదిలిపెట్టారని, రేషన్ మాఫియా నాయకుడికి సహకరిస్తున్నారని ఆరోపించారు. ఇందులో నిజానిజాలు తెలుసుకోవడం కోసం మంత్రి నాదెండ్ల జిల్లా సివిల్ సప్లయ్స్ అధికారులను అమరావతికి పిలిపించారు. బుధవారం ఉదయం వీరు అమరావతికి చేరుకున్నారు. అయితే రాత్రి ఏడుగంటల వరకు కూడా వీరిని విచారించలేదని తెలిసింది.

సీరియస్‌గా తీసుకున్న మంత్రి నాదెండ్ల

ఇదిలా ఉండగా రేషన్ బియ్యం పక్కదారి పట్టే విషయాన్ని మంత్రి నాదెండ్ల సీరియస్‌గా తీసుకున్నారు. రేషన్ బియ్యం తినడాన్ని ప్రజలు ఇష్టపడటం లేదు. దీంతో డీలర్లే కిలోకు రూ. 10 ఇచ్చి కార్డుదారుల నుంచి బియ్యం కొనుగోలు చేస్తున్నారు. రేషన్ డీలర్ల నుంచి కొంత మంది దళారులు బియ్యాన్ని సేకరించి లారీలలో చెన్నైకి తరలిస్తున్నారు. రేషన్ బియ్యం సేకరించి అక్రమ రవాణా చేసే దళారుల్లో అన్నీ పార్టీలకు చెందిన ద్వితీయ శ్రేణి నాయకులు ఉన్నారు. ఈ వ్యవహారం గత వైసీపీ ప్రభుత్వం నుంచి జరుగుతోంది. ఈ వ్యవహారాన్ని కూడా మంత్రి నాదెండ్ల సీరియస్‌గా తీసుకున్నారు. నెల్లూరు జిల్లాలో రేషన్ బియ్యం నిజంగా పక్కదారి పడుతోందా..? ఎంత మేర పక్కదారిపడుతోంది..? వాటిని సేకరించి చెన్నైకి తరలిస్తున్న దళారులు ఎవరు..? వారి వెనుక ఉన్న రాజకీయ శక్తులు ఏవి..? అనే వివరాలు తెలుసుకోవడం కోసం సివిల్ సప్లయ్స్ అధికారులను అమరావతికి పిలిపించారు.

నవంబరు 15 వరకు
ఇండస్ట్రీ పార్టనర్‌షిప్ డ్రైవ్

- కలెక్టరు హిమాన్షు శుక్లా

కందుకూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (ఏపీఐఐసీ) ఆధ్వర్యంలో జిల్లాలో గురువారం నుంచి నవంబరు 15 వరకు ఇండస్ట్రీ పార్టనర్‌షిప్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు కలెక్టరు హిమాన్షుశుక్లా తెలిపారు. బుధవారం కందుకూరులోని సబ్ కలెక్టరు కార్యాలయంలో ఇందుకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యం రాష్ట్రంలో పారిశ్రామికవృద్ధిని వేగవంతం చేయటం, పెట్టుబడి దారులు, ప్రభుత్వం మధ్య బలమైన భాగస్వామ్యాన్ని ఏర్పరచడమేనన్నారు. ఈ డ్రైవ్‌లో భాగంగా ఏపీఐఐసీ ప్రతినిధులు జిల్లాలో పరిశ్రమల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించనున్నారని తెలిపారు.. స్థానిక పరిశ్రమల అభివృద్ధి, మౌలికసదుపాయాల విస్తరణ, కొత్త పెట్టుబడుల ప్రోత్సాహం, యువతకు ఉద్యోగావకాశాల సృష్టి ఈ డ్రైవ్ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. కార్యక్రమంలో కందుకూరు సబ్ కలెక్టరు హిమవంశీ, ఏపీఐఐసీ జోనల్ మేనేజరు శివకుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


పార్టనర్‌షిప్ డ్రైవ్ గోడపత్రికను ఆవిష్కరిస్తున్న కలెక్టరు శుక్లా, అధికారులు

ఇండోసోల్‌కు భూములిస్తే
పరిహారం ఇవ్వరా..?

తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతుల ఆందోళన


ఉలవపాడు తహసీల్దార్ కార్యాలయం ముందు ఆందోళన చేస్తున్న బాధిత రైతులు

ఉలవపాడు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కరేడులో ఏర్పాటు చేయనున్న ఇండోసో ల్ కంపెనీకి స్వచ్ఛందంగా భూములు ఇవ్వగా, తమ భూములకు కంపెనీ నుం చి నష్టపరిహారం అందించే విషయంలో రెవెన్యూ అధికారులు కుంటిసాకులతో తిప్పించుకుంటున్నారని రైతులు బుధవారం తహసీల్దార్ కార్యాలయం ముం దు ఆందోళన చేశారు. గత మూడు నెల ల నుంచి ఇండోసోల్‌కు ఇచ్చిన భూములను ఆన్‌లైన్ చేయకుండా వీఆర్వో, తహ సీల్దార్ తిప్పించుకుంటున్నారని కరేడు పంచాయతీ ధర్మారెడ్డి సంఘం ఎస్టీ కాలనీ వాసులు, ఉప్పరపాలెం ఎస్టీ కాలనీవాసులు వాపోయారు. ఎస్టీలకు చెందిన 18 ఎకరాల భూమిని అలగాయపాలెం, బట్టియసోమయ్యపాలెంకు చెందిన బీసీల నుంచి తిరిగి అప్పగించాలని తహసీల్దార్ లావణ్య ఎస్టీలకు ప్రొసీడింగ్ ఉత్తర్వులు ఇచ్చారు. తమకు నష్టం జరిగిందని స్వచ్ఛందంగానే ఎస్టీలు భూములు అమ్మేశారని, తిరిగి తీసుకోవడంపై కొందరు బీసీలు హైకోర్టును ఆశ్రయించారు. ఆ భూములను 75 రోజుల్లో ఆన్‌లైన్ చేసిస్తామని అప్పటి తహసీల్దార్ చెప్పారని, నెలలు గడుస్తున్నా కార్యాలయం చుట్టూ తిప్పించుకుంటున్నారేతప్ప పరిష్కరించడం లేదని ఎస్టీ యానాది సంఘం నాయకులు బుధవారం తహసీల్దార్ కార్యాలయానికి వచ్చారు. తహసీల్దార్ టీ. శ్రీనివాసులు కందుకూరు జరిగే కలెక్టర్ సమావేశంలో పాల్గొనేందుకు వెళ్లారు. దీంతో యానాది సంఘం నాయకులు కందుకూరు సబ్‌కలెక్టర్ హిమవంశీతో ఫోన్‌లో మాట్లాడారు. గురువారం ఉదయం కందుకూరు వచ్చి సమస్యపై మాట్లాడాలని ఆయన బాధితులకు సూచించారు.

భూసమస్యలు పరిష్కరిస్తున్నాం..

ఇండోసోల్‌కు స్వచ్ఛందంగా ఇస్తున్న భూముల విషయంలో ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కరిస్తున్నామని తహసీల్దార్ శ్రీనివాసులు వివరణ ఇచ్చారు. ధర్మారెడ్డి సంఘం ఎస్టీలకు సంబంధించిన భూముల సమస్య హైకోర్టులో ఉన్నందున ఆ భూమలకు ఆన్‌లైన్ సమస్య ఏర్పడిందన్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామన్నారు.

మార్కెట్లపై దాడులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

- కూరగాయల మార్కెట్, దుకాణాల్లో తనిఖీలు
- తూకాల్లో వ్యత్యాసం
- ఐదుగురు వ్యాపారులపై కేసులు


నగరంలోని ఏసీ కూరగాయల మార్కెట్లో వేయింగ్ మిషన్‌ను తనిఖీ చేస్తున్న తూ.కొ. అధికారి

నెల్లూరు(సిటీ), అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు నగరంలోని పలు మార్కెట్లలో తూకాల్లో వస్తున్న భారీ తేడాలను తూనికల, కొలతలశాఖ ఇన్‌స్పెక్టర్లు పసికట్టారు. బుధవారం వారు పలు ప్రాంతాల్లో నిర్వహించిన ఆకస్మిక దాడుల్లో తూకాల్లో మోసాలకు పాల్పడుతున్న ఐదుగురు వ్యాపారులపై కేసులు నమోదు చేశారు. 'కిలోకి అరకిలోనే '.. అనే శీర్షికన బుధవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి తూనికల, కొలతలశాఖ నెల్లూరు ఇన్‌స్పెక్టర్ షేక్ రియాజ్‌అహ్మద్, కావలి ఇన్‌స్పెక్టరు షేక్ మోహిసిన్, టెక్నికల్ సిబ్బంది శ్రీకాంత్ స్పందించారు. వారంతా నెల్లూరులోని ఏసీ కూరగాయల మార్కెట్, మైపాడు గేట్ వద్దనున్న మత్స్యభవన్, కోనేటిమిట్ట కూరగాయల మార్కెట్‌లతోపాటు వివిధ కూడళ్ల వద్ద నున్న చికెన్, మటన్, చిల్లర దుకాణాలను తనిఖీలు చేపట్టారు. తూకాల్లో భారీగా తేడాలు కనబడడంతో ఐదుగురిపై కేసులు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్లు వెల్లడించారు. వ్యాపారులు చట్టంప్రకారం ధ్రువీకరించిన పరికరాలను మాత్రమే ఉపయోగించాలని వారు సూచించారు.

పెళ్లి చూడకనే ప్రాణాలు వదిలారు...

- బైకును ఢీకొన్న బోర్‌వెల్ లారీ
- అక్కడికక్కడే ముగ్గురి మృత్యువాత
- మృతుల్లో తల్లిదండ్రులు, పెద్ద కుమార్తె
- చిన్నకుమార్తెకు తీవ్ర గాయాలు




ప్రమాదానికి కారణమైన బోర్‌వెల్ లారీ, తీవ్రంగా గాయపడ్డ మేఘన

కలిగిరి, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): ముద్దులొలికే ఇద్దరు చిన్నారులు, భార్యతో కలిసి స్వగ్రామంలో ఈనెల 18న జరగనున్న పెళ్లికి వచ్చింది ఆ కుటుంబం. పెళ్లి వేడుక చూడకముందే రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలైంది. మరో చిన్నారి తీవ్రగాయాలతో ఆసుపత్రి పాలైంది. ఈ ఘటన బుధవారం మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు, కలిగిరి మండలం తూర్పుదూబగుంట గ్రామానికి చెందిన చవలమూడి బాబు బేల్దారి పని చేసుకోవడానికి సుమారు పదేళ్లక్రితం తెలంగాణ రాష్ట్రం నిజామాబాద్ వెళ్లాడు. అక్కడే బేల్దారి పనులకు వచ్చిన మధ్యప్రదేశ్‌కి చెందిన యువతి మమతను ఏడేళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. బాబుకు ఇద్దరు కుమార్తెలు, పెద్దకుమార్తె వైభకు ఆరేళ్లు. చిన్న కుమార్తె మేఘనకు ఐదేళ్లు. స్వగ్రామంలో ఈనెల 18న బంధువుల వివాహం ఉండటంతో 10రోజుల ముందుగానే కుటుంబంతో కలిసి బాబు స్వగ్రామానికి వచ్చాడు.

ఆధార్ కోసం వచ్చి...

ఈ క్రమంలో భార్య ఆధార్‌కార్డులో అడ్రస్‌ను మధ్యప్రదేశ్ నుంచి దూబగుంటకు మార్చుకోవడంతో పాటు, కుమార్తెలకు కొత్త ఆధార్‌కార్డులు తీయించడానికి బుధవారం ఉదయం బాబు కలిగిరికి వచ్చాడు. ఆధార్ దరఖాస్తు ఫారాలు రాయించుకొని కలిగిరి నుంచి తూర్పు దూబగుంటకు తిరుగు ప్రయాణమయ్యాడు. ఈ క్రమంలో చిన అన్నలూరు విద్యుత్‌సబ్‌స్టేషన్, తెల్లపాడు క్రాస్ రోడ్డు సమీపానకొచ్చేసరికి కుడుములదిన్నెపాడు నుంచి చినఅన్నలూరుకు ఎరువులను తీసుకెళ్తున్న ఆటోను ఓవర్‌టేక్ చేసే క్రమంలో మోటారు సైకిల్‌ను రోడ్డునుంచి మార్జిన్ కిందకు దింపాడు. తిరిగి రోడ్డుపైకి ఎక్కే క్రమంలో మోటార్‌బైక్ అదుపుతప్పి బైక్‌లో ఉన్న నలుగురు రోడ్డుపై పడిపోయారు. ఇంతలో ఎదురుగా నరసారెడ్డిపాలెంలో బోరు వేసి వింజమూరు వెళ్తున్న లారీ వీరిని ఢీకొట్టి రోడ్డుపై ఈడ్చుకెళ్లింది. ఈ ఘటనలో బాబు(35), మమత(28), వైభ(5) అక్కడికక్కడే మృతి చెందారు. చిన్నారి మేఘన చేతిపై లారీ వెళ్లడంతో చేయి నుజ్జునుజ్జు అయింది. ప్రమాదం విషయం తెలియగానే కాలనీవాసులు ఘటనాస్థలానికి చేరుకొని కన్నీరుమున్నీరయ్యారు.

నాలుగేళ్ల క్రితం సోదరి మృతి

కాగా బాబు సోదరి కొండాపురం మండలం జంగాలపల్లిలో అత్తవారింటలో నాలుగేళ్ల క్రితం పాము కాటుకు గురై మరణించింది. బాబు తల్లి, తండ్రి హైదరాబాద్‌లో బేల్దారి పనులు చేసుకుంటూ ఇటీవల వారు కూడా స్వగ్రామానికి వచ్చారు. తండ్రి శ్రీనివాసులు రెండురోజుల క్రితం తిరిగి హైదరాబాద్ వెళ్లగా, తల్లి స్వగ్రామంలోనే ఉంది. పెళ్లి వేడుకలతో సంతోషంగా గడపాల్సిన కాలనీ మొత్తం బాబు కుటుంబం మృత్యువాత పడటంతో విషాదంలో మునిగిపోయింది.


ఘటనా స్థలంలో చెల్లాచెదరుగా మృతదేహాలు

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	125
స్కిన్ చికెన్	226
స్కిన్‌లెస్	250

కోడిగుడ్ల ధర (100): 550

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.12156
వెండి కిలో ధర	రూ. 1,80,000
వెండి ఒక గ్రాము	రూ.189.00

పౌష్టికాహారంపై గర్భిణులు, బాలింతలకు అవగాహన

సంగం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జండాదిబ్బలో ఐసీడీయస్ ఆధ్వర్యంలో పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా బుధవారం గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఐసీడీయస్ సూపర్‌వైజర్ సునీలత మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. పౌష్టికాహారం తీసుకోవడం వల్ల అందరూ ఆరోగ్యంగా ఉంటారన్నారు. అనంతరం అధిక పోషక విలువలు ఉండే ఆకు, కాయగూరలను ప్రదర్శించారు.

అబ్దుల్ కలాం జీవితం అందరికీ స్ఫూర్తిదాయకం



కందుకూరు: అబ్దుల్‌కలాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నేతలు

కందుకూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): దివంగత భారత మాజీ రాష్ట్రపతి, భారతరత్న ఏపీజే అబ్దుల్‌కలాం జయంతి సందర్భంగా బుధవారం పలువురు ఘన నివాళులర్పించారు. స్థానిక ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాలలో ఐటీసీ కాగితం పునర్వినియోగంతో సంయుక్తంగా కాగితం వ్యర్థాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కే. విజయ్‌శ్రీనివాస్, ప్రిన్సిపాల్ సీహెచ్ రవికుమార్, వైస్ ప్రిన్సిపాల్ వీ.హరిబాబు, ఒంగోలు ప్రాంతీయ నిర్వాహకుడు కే.నాగేశ్వర రావు పాల్గొన్నారు. స్థానిక టీఆర్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలోను ప్రిన్సిపాల్ షేక్ నాగూర్‌వలీ ఆధ్వర్యంలో కళాశాల ఆవరణలో ఉన్న అబ్దుల్‌కలాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముస్లిం ఐక్యవేదిక ఆధ్వర్యంలో అబ్దుల్‌కలాం జీవిత విశేషాలపై విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. టీడీపీ కార్యాలయంలో పార్టీ నాయకులు దామా మల్లేశ్వర రావు, సయ్యద్ అహ్మద్‌బాషా, షేక్ రఫీ, షేక్ సలాం, అల్లం వెంకటేశ్వర్లు, బెజవాడ ప్రసాదు, తదితరులు అబ్దుల్‌కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.

● **కావలి(టౌన్):** భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం 94వ జయంతి సందర్భంగా బుధవారం జెండా చెట్టు సెంటర్‌లోని కలాం విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. డాక్టర్ ప్రభాకర్‌నాయుడు వైద్యశాల ప్రాంగణంలో పలు స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థల గౌరవాధ్యక్షుడు ఎస్‌కె ఖాదర్‌బాషా, దిలీప్‌కుమార్, జమీర్, సలీమ్‌బేగ్, పఠాన్ ఖాదర్‌బాషా, అజిత్‌బాబు, రామచంద్రయ్య పాల్గొన్నారు. అలాగే వెంగళరావునగర్‌లోని శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారిణి కోటేశ్వరి అధ్యక్షన జరిగిన కలాం జయంతి వేడుకల్లో ఆయన చిత్రపటానికి పలువురు పాఠకులు పూలమాల వేసి నివాళులర్పించారు.

● **బిట్రగుంట:** బోగోలు మండలం విశ్వనాథ రావుపేట పంచాయతీ ఇబ్రహీంపేట కూడలిలోని మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బిట్రగుంట రైల్వే అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు షేక్.నూరుద్దీన్, మాజీ సైనికుడు విజయప్రతాప్‌రెడ్డి, జిల్లా హ్యూమెన్ రైట్స్ అధ్యక్షుడు దాసరి సునీల్, బొంతా సుధీర్, అహ్మద్ హుసేన్, కొండయ్య, అహ్మద్‌బాషా పాల్గొన్నారు.

● **ఆత్మకూరు:** భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజె అబ్దుల్‌కలాం జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని ఆవాజ్ కమిటీ నేతలు పేర్కొన్నారు. బుధవారం ఆత్మకూరు పట్టణంలో అబ్దుల్‌కలాం జయంతి వేడుకలను ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ సూరా భాస్కర్‌రెడ్డి, ఆవాజ్ కమిటీ నాయకుడు పి యస్థానీ, సీపీఎం నాయకుడు నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

● **సంగం:** స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు బుజ్జయ్య ఆధ్వర్యంలో భారతరత్న, మాజీ రాష్ట్రపతి ఏపీజె అబ్దుల్ కలాం జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అదేవిధంగా సంగం రాళ్లచెలిక వీవర్స్ కాలనీ ప్రాథమిక పాఠశాల, తరుణవాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కలాం జయంతిని ఘనంగా నిర్వహించారు.

● **దుత్తలూరు (ఉదయగిరి):** దివంగత మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్‌కలాం జీవితం అందరికీ స్ఫూర్తిదాయకమని విశ్వతేజ పాఠశాల కరస్పాండెంట్ దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి అన్నారు. బుధవారం అబ్దుల్‌కలాం జయంతి సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రత్యేక ఆధార్ శిబిరాలను గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలి



అనంతసాగరం: ఆధార్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఐజాక్ ప్రవీణ్

అనంతసాగరం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక ఆధార్ శిబిరాలను గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని అనంతసాగరం ఎంపీడీవో ఐజాక్‌ప్రవీణ్ తెలిపారు. దేవరాయపల్లి బిట్-2లో నిర్వహిస్తున్న ఆధార్ కేంద్రాన్ని ఆయన బుధవారం పరిశీలించారు. ఈనెల 18 వరకు కేంద్రాలు అందుబాటులో ఉంటాయని, ఆధార్ నమోదు చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రమణరావు పాల్గొన్నారు.

● **ఆత్మకూరు :** స్థానిక మున్సిపల్ బస్టాండ్ సమీపంలోని అరుంధతీయవాడ సచివాలయంలో గురువారం నుంచి మూడు రోజుల పాటు ప్రత్యేక ఆధార్ శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. కావున ఎస్టీ కులమునకు చెందిన ఆత్మకూరు పట్టణ ప్రజలు ఈ ఆధార్ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నకిలీ మద్యాన్ని గుర్తించేందుకు ప్రత్యేక యాప్

● **ఆత్మకూరు ప్రొహిబిషన్, ఎక్సైజ్ సీఐ ఆర్వీ రమణమ్మ**



మాట్లాడుతున్న ప్రొహిబిషన్, ఎక్సైజ్ సీఐ ఆర్వీ రమణమ్మ

ఆత్మకూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): నకిలీ మద్యం నాణ్యతను గుర్తించడానికి ప్రత్యేక యాప్‌ను రూపొందించినట్లు ఆత్మకూరు ప్రొహిబిషన్, ఎక్సైజ్ సీఐ ఆర్‌వి రమణమ్మ తెలిపారు. బుధవారం ఆమె ఆత్మకూరు ఎక్సైజ్ కార్యాలయంలో మాట్లాడుతూ ఏపీ ప్రభుత్వం ఏపీ ఎక్సైజ్ సురక్షా యాప్‌ను అందుబాటులోకి తెచ్చిందన్నారు. ఈ యాప్‌ను ప్రతి ఒక్కరు డౌన్‌లోడ్ చేసుకుని మద్యం బాటిల్‌ను స్కాన్ చేస్తే మద్యం నాణ్యత తెలుసుకోవచ్చన్నారు. జిల్లా డిప్యూటీ కమిషనర్ ఎం శంకరయ్య, జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి ఏ శ్రీనివాసులునాయుడు ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఏపీ ఎక్సైజ్ సురక్షా యాప్‌ను ప్రతి ఒక్కరు ప్లేస్టోర్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవాలని, అక్రమంగా మద్యం అమ్మితే 9440902525 నెంబరుకు ఫోన్ చేయాలని కోరారు. బెల్టుషాపులు, నాటుసారా అక్రమంగా అమ్ముతున్నట్లు తెలిస్తే తమకు ప్రజలు సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వ్యక్తి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోండి.. మద్యం నాణ్యత తెలుసుకోండి

● **ఉదయగిరి :** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని మద్యం నాణ్యత తెలుసుకోవచ్చని ఉదయగిరి ప్రొహిబిషన్ ఎక్సైజ్ సీఐ టీ లక్ష్మణస్వామి పేర్కొన్నారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఉదయగిరి, దుత్తలూరు, మర్రిపాడు, సీతారామపురం మండలాలకు చెందిన మద్యం దుకాణాల యజమానులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనధికార మద్యం విక్రయాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో మద్యం బెల్టు దుకాణాలు నిర్వహిస్తే 9440902522 నెంబర్‌కు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐలు దీప్తికరంత్, శ్రీనివాసరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్‌ను ఉపయోగించుకోవాలి

కావలి/కందుకూరు అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మద్యం దుకాణాలు, బార్ అండ్ రెస్టారెంట్‌లలో కొనుగోలు చేసిన మద్యం బాటిళ్లు సురక్షితమైనవో కాదో తెలుసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్‌ను ప్రవేశపెట్టిందని కావలి, కందుకూరు ఇన్‌చార్జి ఎక్సైజ్ సీఐ సుంకర శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. కావలి సర్కిల్ పరిధిలో ఉన్న కావలి పట్టణం, కావలి రూరల్, జలదంకి, బోగోలు మండలాల్లోని మద్యం వినియోగదారులు ఈ యాప్‌ను ఉపయోగించుకోవాలని తెలిపారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశయ సాధనే ధ్యేయం

● **మంత్రి ఆనం రామనారాయణరెడ్డి కుమార్తె కైవల్యారెడ్డి**



దత్తత తీసుకున్న బొమ్మిరెడ్డి బాలుకు చెక్కును అందజేస్తున్న ఆనం కైవల్యారెడ్డి

ఆత్మకూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు చేపట్టిన పీ-4 కార్యక్రమం పేదల అభివృద్ధికి బంగారు బాటలు వేస్తుందని, ఆయన ఆశయ సాధనే ధ్యేయమని రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డి కుమార్తె ఆనం కైవల్యారెడ్డి తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ మందిరంలో బుధవారం ఆర్డీవో బి పావని అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో బండారుపల్లికి చెందిన బొమ్మిరెడ్డి మల్లేశ్వరి కుటుంబానికి మార్గదర్శిగా దత్తత తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల తన తండ్రి ఆనం రామనారాయణరెడ్డి ఆత్మకూరు పర్యటనలో పాలిటెక్నిక్ చదువుతున్న బొమ్మిరెడ్డి బాలు తనకు ప్రమాదవశాత్తు కోల్పోయిన కుడి కాలుకు ప్రత్యామ్నాయంగా కృత్రిమ జైపూర్ కాలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేయగా, మంత్రి ఆనం ఆ విద్యార్థి యోగక్షేమాలు చూసుకుంటానని ఆ కుటుంబానికి ధైర్యం చెప్పారని, ఈక్రమంలో తన తండ్రి సూచనల మేరకు బొమ్మిరెడ్డి బాలు కుటుంబాన్ని దత్తత తీసుకున్నానని పేర్కొన్నారు. అనంతరం ఆమె బొమ్మిరెడ్డి బాలు కుటుంబానికి చెక్కును అందజేశారు. ముందుగా ఆర్డీవో బి పావని మాట్లాడారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ షేక్ సర్దార్, కౌన్సిలర్లు షేక్ గౌస్‌బాష, కొప్పోలు రమాదేవి, సూరా భాస్కర్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పులిమి శైలజారెడ్డి పాల్గొన్నారు.

యూరియా కార్డుల పంపిణీపై అవగాహన

బిట్రగుంట, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): బోగోలు మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో బుధవారం మండల వ్యవసాయ అధికారిని బీశైలజ ఆధ్వర్యంలో యూరియా కార్డుల పంపిణీపై అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి కావలి వ్యవసాయ సబ్ డివిజన్ అధికారి సీహెచ్.నాగరాజు హాజరై యూరియా కార్డుల పంపిణీ గురించి రైతులు, ఎరువుల డీలర్లకు వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరరావు, నాగులవరం పీఏసీఎస్ చైర్మన్ చిలకపాటి వెంకటేశ్వర్లు, డైరెక్టర్ లక్కాకుల మాధవరావు, రైతు నేతలు కోటా వెంకారెడ్డి, యన్నాబత్తిన వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

75శాతం హాజరు ఉన్నవారికే కుట్టు మిషన్లు



కుట్టు శిక్షణ పూర్తిచేసుకున్న మహిళలతో బీసీ కార్పొరేషన్ ఈడీ నిర్మలాదేవి, తదతరులు.

కలువాయి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): శిక్షణా తరగతుల్లో 75 నుంచి 80 శాతం హాజరు ఉన్న మహిళలకే కుట్టుమిషన్లు అందజేయనున్నట్లు బీసీ కార్పొరేషన్ ఈడీ ఏ నిర్మలాదేవి స్పష్టం చేశారు. బుధవారం కలువాయిలో కుట్టు శిక్షణా తరగతుల ముగింపు కార్యక్రమానికి హాజరైన ఆమె మాట్లాడుతూ శిక్షణ తరగతుల్లో 75శాతం హాజరు ఉన్న మహిళలకు ఒక పరీక్ష నిర్వహించి అనంతరం వారికి మిషన్లు ఇస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శైలజ, టీడీపీ నాయకులు చల్లా రఘురామిరెడ్డి, జగదల్ నాయుడు, చల్లా విజయభాస్కర్‌రెడ్డి, బీజేపీ నాయకులు దండు పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

వెంగమాంబను దర్శించుకున్న ఎచ్చెర్ల ఎమ్మెల్యే

దుత్తలూరు(ఉదయగిరి), అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్రవాడ గ్రామంలో ఉన్న వెంగమాంబ పేరంటాలమ్మ తల్లిని బుధవారం శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల బీజేపీ ఎమ్మెల్యే నడుకుదుటి ఈశ్వరరావు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. అర్చకులు ఆయనకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మేకపాటి మాల్యాద్రినాయుడు, కదిరి వెంకటరంగరావు, చీదర్ల శివపార్వతి, చుండి హరిగోపాల్‌రెడ్డి, మల్లికార్జుననాయుడు, ఆవుల రోశయ్య, వెంకటస్వామి, ఈశ్వర్‌రెడ్డి, జీ.వెంకటేశ్వర్లు, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

వీరాంజనేయస్వామి ఆలయ చెర్మన్‌గా మండవ

మర్రిపాడు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): చిన్నమాచునూరులోని వీరాంజనేయ స్వామి ఆలయ నూతన చెర్మన్‌గా మండవ సుబ్బరాయుడు బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. కోవూరు డివిజన్ ఎండోమెంట్ అధికారి నాగమల్లేశ్వరరాజు ఆయనతో ఆలయంలో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో పావులూరి వెంకటరామయ్య, ఈశ్వర్‌రెడ్డి, రామ్మోహన్, శ్రీనివాసులు కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ బాలికా దినోత్సవం

సంగం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జండాదిబ్బ ఉన్నత పాఠశాలలో బుధవారం అంతర్జాతీయ బాలికా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామంలో ర్యాలీ, మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఐసీడీయస్ సూపర్‌వైజర్ సునీలత, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి : సీఐటీయూ

ఉదయగిరి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ డిపోల్లో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆర్టీసీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీ.తులసీరామ్ బుధవారం సీఐటీయూ నాయకులతో కలిసి డిపో మేనేజర్ రమేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు గడ్డం నాగేశ్వరరావు, కోడె రమణయ్య, యస్థానీ, వెంకటేశ్వర్లు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

నూరు శాతం ఈ-పంట నమోదు చేయాలి

ఉదయగిరి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలో వీఆర్వోలు, వీపీఏలు సమష్టిగా పనిచేసి నూరు శాతం ఈ-పంట నమోదు చేయాలని తహసీల్దారు ఎల్ రామ్మోహన్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో మండల వ్యవసాయాధికారి విజయభాస్కర్‌తో కలిసి సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 25వ తేదీలోపు నూరు శాతం పూర్తి చేయాలన్నారు. మండలంలో అర్హులైన కౌలు రైతులకు కార్డులు అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిటీ షాజియా, ఏఎస్‌వో సుమ, వీఆర్వోలు, వీపీఏలు తదితరులు పాల్గొన్నారు.

డీసీపల్లిలో పొగాకు ధరలు

మర్రిపాడు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : డీసీపల్లి పొగాకు వేలం కేంద్రానికి బుధవారం రైతులు 975 బేళ్లను తీసుకొని రాగా 20 కంపెనీల ప్రతినిధులు వేలంలో పాల్గొని 605 బేళ్లను కొనుగోలు చేశారు. వివిధ కారణాలతో 370 బేళ్లను తిరస్కరించారు. కేజీ గరిష్ఠ ధర రూ. 315కాగా, కనిష్ఠ ధర రూ. 65 పలికినట్లు వేలం నిర్వహణాధికారి జి రాజశేఖర్ తెలిపారు.

గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుతో ఆర్థికాభివృద్ధి : ఎమ్మెల్యే ఇంటూరి

కందుకూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో ఏర్పాటు కానున్న గూగుల్ డేటా సెంటర్‌తో రాష్ట్రం ఆర్థికంగా అభివృద్ధి చెందుతుందని, యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వర రావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రపంచంలో అతిపెద్ద డేటాసెంటర్‌లలో ఒకటిగా, భారత్‌లో తొలి ఏఐ హబ్‌గా విశాఖలో ఏర్పాటు కానున్న ఈ సెంటర్‌ను రాష్ట్రానికి సాధించటంలో రాష్ట్ర ఐటీశాఖా మంత్రి, యువనేత నారా లోకేష్ కృషి ఎనలేనిదని కొనియాడారు. ఈ ప్రాజెక్టు గ్రామీణ ఆర్థికవ్యవస్థను, వ్యవసాయాన్ని విద్య వైద్యరంగాలను బలోపేతం చేస్తుందని తెలిపారు.

గూగుల్ రాకతో రాష్ట్రాభివృద్ధి : కాకర్ల

● **ఉదయగిరి:** గూగుల్ రాకతో రాష్ట్రం అన్ని రంగాలలో సర్వతోముఖాభివృద్ధి చెందుతుందని ఉదయగిరి శాసనసభ్యుడు ఎమ్మెల్యే కాకర్ల సురేష్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. విశాఖపట్నం కేంద్రంగా రూ.1.33 లక్షల కోట్ల పెట్టుబడితో గూగుల్ సంస్థ డేటా సెంటర్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. దీని ద్వారా రెండు లక్షల మందికి ప్రత్యక్ష, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. సాంకేతిక రంగంలో వినూత్న మార్పులు చోటుచేసుకొని రాష్ట్రం దేశంలోనే సాంకేతికపరంగా అగ్రస్థానంలో నిలుస్తుందన్నారు. గూగుల్ సంస్థను రాష్ట్రానికి తీసుకొచ్చిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర ఐటీశాఖా మంత్రి నారా లోకేష్‌బాబులకు ఆయన ఈసందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

చేతుల శుభ్రతతో అంటువ్యాధుల నివారణ



కావలి(టౌన్): చేతుల పరిశుభ్రత కార్యక్రమంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్

కావలి(టౌన్), అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): చేతుల శుభ్రంతో అంటువ్యాధులను అరికట్టవచ్చని మున్సిపల్ కమిషనర్ శ్రావణ్ కుమార్ అన్నారు. బుధవారం గ్లోబల్ హ్యాండ్ వాష్‌డేని పురస్కరించుకుని మెప్మాఆధ్వర్యంలో జరిగిన అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ చేతుల పరిశుభ్రత విధిగా పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ ఫణికుమార్, సామాజిక కార్యకర్త మాలకొండారెడ్డి, సచివాలయం ఏఎన్‌ఎమ్‌లు మున్సిపల్ సిబ్బంది, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

● **ఆత్మకూరు:** స్థానిక మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో బుధవారం మెప్మా ఆధ్వర్యంలో అంతర్జాతీయ చేతుల పరిశుభ్రత దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా మెప్మా సీఎంఎం శ్రీహర్షిత చేతులు పరిశుభ్రత చేసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకురాలు ఆనం కైవల్యారెడ్డి, ఆర్డీవో బి పావని, మున్సిపల్ చైర్‌పర్సన్ జి వెంకటరమణమ్మ, కమిషనర్ గంగా ప్రసాద్, మెప్మా సీవో మాధవి, మున్సిపల్ కౌన్సిలర్లు, టీడీపీ నేతలు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

● **సీతారామపురం:** మండలంలోని ఎస్‌ఆర్ నగర్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు బుధవారం చేతుల శుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో షేక్ మస్తాన్‌వలి తదితరులు పాల్గొన్నారు. మండలంలోని అన్ని పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలలో చేతుల శుభ్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.